నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com
హైదరాబాద్ | గురువారం 31-10-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 81 | పేజీలు: 8 | వెల: రూ.1/-

# రక్షణశాఖ భూములివ్వండి

## – కేంద్ర రక్షణశాఖ మంత్రికి కేటీఆర్ వినతి

న్యూఢిల్లీ, అక్టోబర్30(ఆర్ఎన్ఎ) : తెలంగాణ మునిసిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ బుధవారం ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. సౌత్‌బ్లాక్‌లో రాజ్‌నాథ్‌ను కలిసిన కేటీఆర్ పలు విషయాలపై ప్రస్తావించారు. హైదరాబాద్ – నాగ్‌పూర్, హైదరాబాద్ – రామగుండం జాతీయ రహదారులను విస్తరించడానికి నగరంలోని రక్షణశాఖ భూములను కేటాయించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న రహదారులు రవాణావసరాలకు సరిపోవడం లేదని, ఆయా మార్గాల్లో స్కైవేల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున భూముల అప్పగింతపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాజ్‌నాథ్‌ను కేటీఆర్ కోరారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌తో కలిసి ఉన్న ఫోటోలను కేటీఆర్ తన ట్విటర్ ఖాతాలో షేర్ చేశారు.

# డేంజర్ జోన్‌లో తీర ప్రాంతాలు!

**– 2050 కల్లా మునగనున్న ముంబయి తీరప్రాంతం**
**– వాతావరణ మార్పులను అదుపుచేయకుంటే ప్రమాదమే**
**– హెచ్చరించిన అమెరికన్ క్లయిమెట్ సెంట్రల్ సంస్థ**

న్యూఢిల్లీ, అక్టోబర్30(ఆర్ఎన్ఎ) : సముద్ర తీర ప్రాంతాలు డేంజర్ జోన్‌లో ఉన్నాయా..? ముంబయి మహానగరం మునక ఖాయమా..? అంటే అవుననే చెబుతుంది ఓ అధ్యయన సంస్థ. వాతావరణంలో మార్పులను అదుపు చేయలేక పోతే పెనుప్రమాదం ఖాయమని, ఈ ప్రమాదం 2050నాటికి చోటుచేసుకో నుందని ఆ సంస్థ వెల్లడించింది. అమెరికాకు చెందిన క్లయిమెట్ సెంట్రల్ సంస్థ సర్వే నిర్వహించింది. ఈ సంస్థ ప్రతిపాదనల ప్రకారం 2050 నాటికి తీర ప్రాంతాలన్నీ దాదాపు మునగనున్నాయని తేల్చి చెప్పింది. ఆ డేంజర్ జోన్‌లో మన ముంబై నగరం కూడా ఉన్నదని, ముందుగా అంచనా వేసిన దాని కన్నా.. పరిస్థితులు మరింత భయానకంగా ఉండనున్నట్లు అధ్యయన సంస్థ తాజా హెచ్చరిక జారీ చేసింది. 2050 కల్లా ముంబై తీర ప్రాంతం అంతా నీట మునగనున్నట్లు చెప్పింది. ఆ మహానగరం కనుమరుగు అయ్యే అవకాశాలు ఉన్నాయని, వాతావరణ మార్పులను అదుపు చేయకుంటే.. ఆ ఉపద్రవాన్ని ఆపలేమని రిపోర్ట్ తేల్చింది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 15కోట్ల మంది ఈ శతాబ్దం మధ్య కల్లా ప్రభావానికి లోనవుతారని చెప్పింది. భీకర వరదల వల్ల వియత్నాం, బ్యాంకాక్, షాంఘై, అలెగ్జాండ్రియా, బస్రా లాంటి నగరాలు కూడా నీట మునగనున్నట్లు ఆ రిపోర్ట్ తెలిపింది. శాటిలైట్ రీడింగ్స్,, సముద్ర అధ్యయనాల ఆధారంగా ఈ బృందం ప్రపంచంలో సముద్ర మట్టాలు పెరుగుతున్న తీరును విశ్లేషించింది. గతంతో పోలిస్తే ఇప్పుడు ప్రమాద తీవ్రత మరింత పెరిగిందని ఈ బృందం అభిప్రాయపడింది. ఈ భూమండలంపైని 150 మంది మిలియన్ ప్రజలపై దీని ప్రభావం పడవచ్చునని, 2050 నాటికి వియత్నాంలోని 20 మిలియన్ల మంది, థాయిలాండ్ లో 10 శాతానికి పైగా ప్రజలు, చైనాలోని షాంగైలో భారీ సంఖ్యలో ప్రజలు ఈ ' బెడద ' ను ఎదుర్కొనవచ్చునని ఈ పరిశోధకులు అంచనా వేశారు. ఈజిప్ట్ లోని అలెగ్జాండ్రియా పూర్తిగా తుడిచిపెట్టుకు పోవచ్చు.. అలాగే ఇరాక్ లోని బాస్రా కు కూడా ముప్పు పొంచిఉందని రీసెర్చర్లు పేర్కొన్నారు.

# జస్టిస్ వెంకటాచల కన్నుమూత

బెంగుళూరు,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): కర్నాటక మాజీ లోకాయుక్త, సుప్రీం న్యాయమూర్తి ఎన్.వెంకటాచల(90) బుధవారం ఉదయం కన్నుమూశారు. బెంగుళూరులోని తన ఇంట్లో అనారోగ్యం కారణంగా తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఓ సీనియర్ అడ్వకేట్. జూలై 3, 1930 న, కోలార్ జిల్లాలోని ములబగల్ తాలూకాలోని మిత్తూరు గ్రామంలో వెంకటచల జన్మించారు. మైసూర్ విశ్వవిద్యాలయం నుండి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ మరియు బ్యాచిలర్ ఆఫ్ లా డిగ్రీలను పొందిన ఆయన.. 1955 న అప్పటి హైకోర్టు మైసూర్‌లో న్యాయవాదిగా పనిచేశాడు. 1968 లో హైకోర్టు ప్రభుత్వ అభ్యర్థిగా ఎన్నికై, 1973 వరకు ఆ పదవిలో కొనసాగాడు. 1977లో హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా పదోన్నతి పొందాడు. 2001 లో కర్ణాటక లోకాయుక్త న్యాయమూర్తిగా పనిచేశారు. 1930 జూలైలో ఆయన ఓ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. మైసూర్ వర్సిటీలో న్యాయ పట్టా పొందారు. 1955లో మైసూర్ కోర్టులో న్యాయవాదిగా రిజిస్టర్ చేసుకున్నారు. బెంగుళూరులో సివిల్, క్రిమినల్ కేసుల్లో ప్రాక్టీసు చేశారు. 1963 నుంచి 1973 వరకు హెబ్బల్‌లోని అగ్రికల్చరల్ సైన్స్ యూనివర్సిటీలో లీగల్ అడ్వైజర్‌గా చేశారు. 1970 నుంచి 1973 వరకు బెంగుళూరు వర్సిటీలోనూ పనిచేశారు. 1968 నుంచి 1973 వరకు ప్రభుత్వ ప్లీడర్‌గా ఉన్నారు. 1973 నుంచి 1977 వరకు హైకోర్టు గవర్నమెంట్ అడ్వకేట్‌గా చేశారు. 1977లో కర్నాటక హైకోర్టు అడిషనల్ జడ్జిగా బాధ్యతలు తీసుకున్నారు. 1992 మే నెలలో ఆయన కర్నాటక హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. అదే ఏడాది జూలైలో సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 1995లో సుప్రీంకోర్టు నుంచి ఆయన రిటైర్ అయ్యారు. పదవీవిరమణ తర్వాత కర్నాటక లోకాయుక్తగా జస్టిస్ వెంకటాచల పని చేశారు.

# ఎమ్మెల్యేగా శానంపూడి సైదిరెడ్డి ప్రమాణ స్వీకారం



హైదరాబాద్, అక్టోబర్ 30: సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన శానంపూడి సైదిరెడ్డి బుధవారం నాడు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన ఛాంబర్‌లో సైది రెడ్డిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, మహమూద్ అలీ, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, చామకూర మల్లారెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇటీవల ముగిసిన హుజూర్‌నగర్ ఉపఎన్నికలో టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సైదిరెడ్డి 43 వేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే.

# క్లైమాక్స్‌కు చేరిన మహారాష్ట్ర 'పాలిటిక్స్'

**♦ 13:26 ఫార్ములాను తెరపైకి తెచ్చిన బీజేపీ**
**♦ శివసేనకు డిప్యూటీ సీఎంతో పాటు 13మంత్రి పదవులు**
**♦ 50:50 ఫార్ములాకే పట్టుబడుతున్న శివసేన**
**♦ నేటితో ప్రతిష్ఠంబన తొలగే అవకాశం**
**– బీజేపీ శాసనసభాపక్షనేతగా ఫడ్నవీస్ ఏకగ్రీవ ఎన్నిక**

ముంబయి, అక్టోబర్30(ఆర్ఎన్ఎ) : మహారాష్ట్రలో సీఎం పదవి కోసం బీజేపీ, శివసేన మధ్య జరుగుతున్న అంతర్యుద్ధం క్లైమాక్స్‌కు చేరింది. మహారాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ ఇప్పటికే శాసనసభా పక్ష నేతను ఎన్నుకునేందుకు సమాశమైంది. ఈ సమావేశంలో శివసేన వైఖరి, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించింది. ఫడ్నవీస్ కూడా ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. శాసనసభాపక్ష నేతగా ఫడ్నవీస్‌ను ఏకగ్రీవంగా ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. శివసేన మద్దతు తీసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ పైచేయి తమదే ఉండాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలిసింది. దీనిలో భాగంగా సీఎం పీఠంపై కూర్చొనేందుకు తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. మరోవైపు సీఎం పదవికి 50:50 ఫార్ములాను అమలు చేయాలన్న శివసేన ప్రతిపాదనకు ససేమిరా అంటోన్న బీజేపీ మంత్రి పదవుల విషయంలో మాత్రం 13:26 ఫార్ములాను అమలు చేయాలనుకుంటుందని సమాచారం. 26మంత్రి పదవులను తమ వద్ద ఉంచుకుని.. 13 మంత్రి పదవులు శివసేనకు కేటాయించాలని బీజేపీ భావిస్తోందట. అయితే... సీఎం సీటునే టర్గెట్‌గా పెట్టుకున్న శివసేన ఈ ప్రతిపాదనకు అంగీకరిస్తుందా అంటే సందేహమేనని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. డిప్యూటీ సీఎం పదవిని బీజేపీ ఆఫర్ చేసినప్పటికీ ఆ పదవితో పెద్దగా ఒరిగేదేమీ లేదని శివసేన భావిస్తోందని సమాచారం. బీజేపీ రాజకీయం ఇలా ఉంటే.. శివసేన కూడా తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైంది. అక్టోబర్ 31న ముంబైలో శాసనసభా పక్ష సమావేశం నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఆదిత్య థాక్రేను శివసేన శాసనసభా పక్ష నేతగా ఎన్నుకునే అవకా శాలు మెండుగా ఉన్నాయి. అనంతరం.. బీజేపీ ప్రతిపాదనలను శివసేన పరిశీలిం చనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో.. బీజేపీ ప్రతిపాదనలకు శివసేన ఎంతవరకూ గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందనేది సందేహమే. కాంగ్రెస్, ఎన్సీపీతో జట్టు కడితే భవిష్యత్ ఎలా ఉంటుందనే విషయాన్ని కూడా నేటి సమావేశంలో చర్చించనున్నారు. ఇలా ఇటు బీజేపీ.. అటు శివసేన 'సీఎం సీట్ పాలిటిక్స్'ను రసకందాయంలోకి నెట్టేశాయి. అక్టోబర్ నెలలో చివరి రోజైన 31వ తేదీతో మహారాష్ట్ర రాజకీయాల్లో నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడే అవకాశం కనిపిస్తోంది.

### శివసేనతో విభేదాలు తొలగిపోతాయి – ఫడ్నవీస్

మహారాష్ట్రలో భాజపా శాసనసభాపక్ష నేతగా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మరోసారి ఎన్నికయ్యారు. విధాన్ భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో కొత్తగా ఎన్నికైన 105 మంది భాజపా ఎమ్మెల్యేలు ఫడ్నవీస్‌ను శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఫడ్నవీస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో భాజపా–శివసేన కచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి అన్నారు. మిత్రపక్షంతో ఏర్పడిన భేదాభిప్రాయాలు త్వరలోనే తొలగిపోతాయని, మరోసారి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేకు ఫడ్నవీస్ కృతజ్ఞతలు తెలిపారు.

# కశ్మీరీలు భారతీయులుగానే ఉంటామన్నారు

**– కశ్మీర్ విషయం పూర్తిగా భారత్ అంతర్గత వ్యవహారం**
**– ఇక్కడి రాజకీయాల్లో వేలుపెట్టబోం**
**– ఉగ్రవాదంపై పోరుకు సహకరిస్తాం**
**– ఈయూ పార్లమెంట్ సభ్యులు**

శ్రీనగర్, అక్టోబర్30(ఆర్ఎన్ఎ) : తాము భారతీయులమేనని, దేశంలోని అందరి భారతీయుల్లానే తామూ బతకాలని కోరుకుంటున్నామని కశ్మీరీలు తమకు చెప్పారని ఐరోపా సమాఖ్య (ఈయూ) పార్లమెంట్ సభ్యులు తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్లో పరిస్థితులను చూస్తామంటూ పర్యటనకు వెళ్లిన ఈయూ ఎంపీల బృందం భారత్ కు మద్దతుగా నిలిచింది. లోయలో శాంతి నెలకొల్పేందుకు తీసుకుంటున్న చర్యలను మెచ్చుకుంది. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు ఆర్మీ చేస్తున్న కృషికి తమ పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు యూరోపియన్ యూనియన్ పార్లమెంటేరియన్లు వెల్లడించారు. ఈ మేరకు వారి ఈ పర్యటన విశేషాలను బుధవారం విలేకరులతో పంచుకున్నారు. పర్యటనలో భాగంగా అక్కడి పౌర సమాజ ప్రతినిధులతో మాట్లాడామన్నారు. పాఠశాలలు, మొబైల్ సేవల పునఃప్రారంభం వంటి పలు అంశాల్ని చర్చించామన్నారు. ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరులో ఐరోపా సమాఖ్య ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. కశ్మీర్ అంశం పూర్తిగా భారత్ అంతర్గత విషయం కావడంతో దీనిపై ఐరోపా సమాఖ్యకు ఎలాంటి నివేదిక సమర్పించబోమని స్పష్టం చేశారు. భారత్ – పాక్ మధ్య సామరస్యపూర్వక చర్చలు జరగాల్సి ఉందని, దీని తమ మద్దతు ఉంటుందని తెలిపారు. భారత్‌లోని విపక్షాలకు కూడా ఇక్కడ పర్యటించే అవకాశం ఇస్తే బాగుంటుందని నికోలస్ ఫెస్ట్ అనే ఎంపీ పేర్కొన్నారు. జమ్మూ–కశ్మీర్‌లో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించడానికి ఐరోపా సమాఖ్య పార్లమెంట్ సభ్యుల బృందం మంగళవారం శ్రీనగర్ చేరుకున్న విషయం తెలిసిందే. అధికరణ 370రద్దు తర్వాత ఓ విదేశీ బృందం కశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటన నిమిత్తం మొత్తం 27మంది ఢిల్లీ చేరుకోగా.. నలుగురు మాత్రం వైదొలగారు. దీంతో మిగిలిన 23 మంది కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. అయితే, వీరి రాకకు నిరసనగా లోయలో బంద్ పాటించగా.. అక్కడక్కడ స్వల్ప స్థాయిలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ విదేశీ బృందం పర్యటనపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైన విషయం తెలిసిందే.

# ముఖ్యమంత్రికి మీరైనా చెప్పండి

## చినజీయర్ దగ్గరకు ఆర్టీసి కార్మికులు

హైదరాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఆర్టీసీ కార్మికులు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తమ డిమాండ్ల పైన ఒప్పించేందుకు అనేక మార్గాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అనేక రకాలుగా నిరసనలు..కోర్టు కేసులు..అఖిలపక్ష సమావేశాలు..చివరకు బంద్ నిర్వహించినా ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం ఒక్క మెట్టు కూడా దిగటం లేదు. పైగా ఆర్టీసీకి భవిష్యత్ లేదని చెబుతున్నారు. అదే సమయంలో యూనియన్లతో సంబంధం లేకుండా ఉద్యోగాలు చేసుకోవాలనుకొనే వారు నేరుగా డిపోల్లోకి వెళ్లి ఉద్యోగాల్లో చేరాలని సూచించారు. అయినా..కార్మిక సంఘాలు మాత్రం పట్టు వీడటం లేదు. దీంతో.. రాజకీయంగా అటు పార్టీలో.. ఇటు ప్రభుత్వంలో కేసీఆర్ ను ఒప్పించే శక్తి ఎవరికి లేదని గ్రహించిన ఆర్టీసీ కార్మిక సంఘాలు కొత్త మార్గాన్ని ఎంచుకున్నాయి. అందులో భాగంగా కేసీఆర్ గౌరవించే వ్యక్తి చిన జీయర్ కావడంతో ఆయనను కలిశారు. చినజీయర్ వద్దకు వెళ్లి తమ సమస్యల ను చెప్పుకుంటే పరిష్కారం లభిస్తుందనే ఆశ తెలంగాణ ఆర్టీసీ కార్మికుల్లో మొదలైంది. కొద్ది రోజుల క్రితం రెవిన్యూ ఉద్యోగులు సైతం తమ సమస్యల గురించి చినజీయర్ ను కలిసి తమ శాఖ రద్దు చేయాలనే ప్రతిపాదనలు ప్రభుత్వం సిద్ధం చేస్తుందని..అలా జరగకుండా అడ్డుకోవాలని కోరారు. అదే తరహాలో ఇప్పుడు ఆర్టీసీ కార్మికులు సైతం చినజీయర్ వద్దకు వెళ్లారు. రాజేంద్రనగర్, మహేశ్వరం డిపోలకు చెందిన 300 మంది కార్మికులు ముచ్చింతల్ ఆశ్రమంలో చినజీయర్ ను కలిశారు. తమ సమ్మె ప్రారంభమై నెల రోజులు అవుతోందని..ఎలాగైనా తమ కార్మికులను కాపాడాలని వారు చిన జీయర్ స్వామిని కోరినట్లు సమాచారం. తమ సమస్యల గురించి సైతం వారు వివరించినట్లు తెలుస్తోంది. దీని పైన కార్మికులు చెప్పిన అంశాలను చిన జీయర్ ఆలకించటం మినహా పెద్దగా స్పందించలేదని సమాచారం. ఒక వైపు ముఖ్యమంత్రి హెచ్చరికలు..వెనక్కు తగ్గని కార్మిక సంఘాలు..కోర్టు జోక్యం నడుమ 26 రోజులుగా సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులు ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికీ వారికి సెప్టెంబర్ జీతాలు అందలేదు. తమ వద్ద నిధులు లేవని ఆర్టీసీ యాజమాన్యం కోర్టుకు స్పష్టం చేసింది. ఇక, సమ్మె డిమాండ్ల విషయంలో ప్రభుత్వం నుండి ఎక్కడా సానుకూలత రావటం లేదు. కోర్టులో ఈ కేసు మరోసారి వాయిదా పడింది. బహిరంగ సభకు ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే కోర్టు నుండి సాధించారు. ఏదో విధంగా ప్రభుత్వం సానుకూలంగా చర్చలు చేస్తే..తాము కూడా ఒక మెట్టు దిగటానికి సిద్ధంగా ఉన్నామంటూ కార్మికులు సంకేతాలు ఇస్తున్నారు. ఇప్పుడు చిన జీయర్ జోక్యం కోసం అభ్యర్ధించారు. మరి..స్వామిజి కేసీఆర్ తో మాట్లాడుతారా..ఏం జరుగుతుందనేది ఆసక్తి కరంగా మారుతోంది.

## ధాన్యం కొనుగోళ్లకు విస్తృత ఏర్పాట్లు

**–కోటి మెట్రిక్ టన్నులు రావచ్చన్న పౌరసరఫరాల శాఖ**

హైదరాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లు కోటి మెట్రిక్ టన్నులు దాటే అవకాశం పౌరసరఫరాల సంస్థ చైర్మన్ ఉందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎర్రమంజిల్‌లో శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ అకున్ సబర్వాల్ కలిసి మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో తొలిసారి రాష్ట్ర స్థాయిలో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సారి వ్యవసాయ శాఖకు కూడా భాగస్వామ్యం కల్పించామన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఏఈఓ ఇంచార్జిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుకు 3,327 కేంద్రాలు ఏర్పాటు చేశామని కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు. వేరే రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్లు కూడా ఏర్పాటు చేస్తామని అకున్ సబర్వాల్ చెప్పారు. వరి ధాన్యం విక్రయంపై అవగాహన కరపత్రాన్ని శ్రీనివాస్‌రెడ్డి, అకున్ సబర్వాల్ విడుదల చేశారు.

# చెల్లెలిని వేధిస్తున్న వ్యక్తి

## మందలించినందుకు హత్య

లక్నో,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): ఉత్తర ప్రదేశ్‌లోని కైరానా ప్రాంతంలో తన చెల్లిని లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిని మందలించినందుకు ఆమె అన్నయ్యను కత్తితో పొడిచి చంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విక్కి చెల్లెలిను అనుజ్ అనే వ్యక్తి తన స్నేహితులతో కలిసి లైంగిక వేధింపులకు గురి చేసేవాడు. విక్కి తన చెల్లిని తీసుకొని విజయ్ సింగ్ పతిక్ కాలేజీ వద్దకు వచ్చేసరికి అనుజ్ కనిపించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వెంటనే అనుజ్ కత్తి తీసుకొని విక్కిని పొడిచాడు. అనంతరం అక్కడి నుంచి అనూజ్ పారిపోయాడు. బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. దీనికి సంబందించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. యుపిలో నేరాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. యుపిలో బిజెపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి క్రైమ్ రేటు పెరుగుతోంది.

# అరేబియా అల్పపీడనం

## – తెలుగు రాష్ట్రాలకు 24గంటల పాటు వర్షసూచన

హైదరాబాద్, అక్టోబర్30(ఆర్ఎన్ఎ) : అరేబియా మహా సముద్రంలో అల్పపీడనంతో.. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అరేబియా సముద్రంలో అల్పపీడనంతో.. దక్షిణ చత్తీస్‌గఢ్, ఉత్తర కర్నాటక, తెలంగాణ మీదుగా 2.1 కిలో మీటర్ల ఎత్తువరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దక్షిణ తమిళనాడు, ఉత్తర శ్రీలంక, కోమోరిన్ ప్రాంతాల నుంచి ఉత్తర కోస్తాంధ్ర వరకు నైరుతి బంగాళాఖాతం మీదుగా అల్పపీడన ద్రోణి ఆవరించింది. అంతేకాకుండా.. లక్షద్వీప్‌లో ఐఎండీ అధికారులు రెండు రోజుల పాటు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ఇది వాయు గుండంగా మారడంతో తూర్పు, ఆగ్నేయం దిక్కుల నుంచి తెలంగాణ మీదకు గాలులు వీస్తున్నాయని సమాచారం. ఈ గాలులతో తెలంగాణలో క్యూములో నింబస్ మేఘాలు ఏర్పాడుతున్నాయని వీటి ప్రభావంతో గురువారం భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. మరో మూడు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురవచ్చని హైదరాబాద్ వాతవరణ శాఖ కేంద్ర వెల్లడించింది. ఇక ఏపీలో ఇప్పటికే.. తీవ్ర ప్రభావ వర్షాలతో.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు మరోమారు హెచ్చరికతో.. ప్రజలు భయాందోళన చెందుతున్నారు.


ఏపీలోని సముద్రంలో వేటకు మత్స్యకారులు వెళ్లద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

### ఈఆర్‌సి ఛైర్మన్‌గా శ్రీరంగారావు బాధ్యతలు

### ప్రమాణం చేయించిన సిఎస్ జోషి

హైదరాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ ఈఆర్‌సీ) చైర్మన్‌గా తన్నీరు శ్రీరంగారావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీరంగారావు చేత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి ప్రమాణస్వీకారం చేయించారు. సాంకేతిక, ఆర్థిక విభాగ సభ్యులుగా మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రాతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ ముగ్గురి పదవీ కాలం ఐదేళ్ల పాటు ఉంటుంది. లేదా 65 ఏళ్ల వయసు వరకు బాధ్యతలు నిర్వర్తించొచ్చు. శ్రీరంగారావు తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల జేఏసీ తరపున చురుగ్గా పని చేశారు. ప్రస్తుతం తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్‌గా వ్యవహరి స్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో జన్మించిన శ్రీరంగారావు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఎ, ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా కోర్టుల్లో 31 ఏళ్ల నుంచి న్యాయవాదిగా పని చేస్తున్నారు

# చరిత్రలో నేటినిజం




కం॥ చిందించి కవన సుధలను
వందనముల నందు కొనిన వరదాచార్యున్
డెందములో నిలుపు కొనుచు
స్పందించెద విషయములకు పద్యమ్ముల లోన్ !!



–రాధశ్రీ
సెల్: 9494481210

( అక్టోబర్ 31 వానమామలై వరదాచార్య వర్ధంతి..)

# పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ ఛైర్మన్‌గా జీవన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, అక్టోబర్ 30: పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ(పీయూసీ) ఛైర్మన్‌గా ఆర్మూర్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యేకు శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పీయూసీ సభ్యులుగా ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, టీ ప్రకాశ్‌గౌడ్, వీఎం అబ్రహం, బీ శంకర్ నాయక్, దాసరి మనోహర్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, సయ్యద్ అహ్మద్ బాషా ఖాద్రీ, కోరుకంటి చందర్, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, పురాణం సతీశ్, టీ జీవన్‌రెడ్డి, ఫారూఖ్‌హుస్సేన్ నియమితులైన విషయం తెలిసిందే.


ప్రముఖ సాహితీ వేత్త, అమృతవాక్కుల గ్రంథ కర్త
కీర్తి శేషులు శ్రీ వేదా చంద్రయ్య గారి సంస్మరణ సభ



1939 - 2019
తేది: 03-11-2019, ఆదివారం సా॥ 4 గం॥ల నుండి 6.30 వరకు
వేదిక: 8-62/2 వీధి నెం.2, సాయినగర్ కాలని, పిర్జాదిగూడ, మేడిపల్లి పోస్ట్, మేడ్చల్ జిల్లా.

| | | |
|---|---|---|
| ముఖ్యఅతిథి | : | డా॥ శ్రీ రంగాచార్యులు |
| సభాధ్యక్షులు | : | ఆచార్య మసన చెన్నప్ప |
| గౌరవ అతిథులు | : | శ్రీ బైసా దేవదాస్ |
| | | డా॥ మక్కపాటి మంగళ |
| ఆత్మీయ అతిథులు | : | శ్రీ సోమ సీతారాములు |
| | | శ్రీ గడ్డం నర్సింహా రెడ్డి |
| | | డా॥ రచ్చా యాదగిరి |
| | | డా॥ పోరెడ్డి రంగయ్య |
| | | శ్రీ చిక్కా రామదాస్ |
| | | శ్రీ గోగులపాటి కృష్ణమోహన్ |
| | | శ్రీ దేవసాని సుదర్శన్ |
| | | డా॥ చెన్న కిష్టయ్య |
| | | డా॥ కస్తూరి లక్ష్మీనారాయణ |
| | | డా॥ మావిశ్రీ మాణిక్యం |
| వందన సమర్పణ | : | శ్రీ వేదా సంపత్ కుమార్ |

వివిధ సాహితీ సంస్థలకు & సాహిత్యాభిమానులందరికి ఆహ్వానం.
అందరికీ ఇదే మా ఆహ్వానం
నిర్వహణ
శిఖా గణేష్ ఉదయ కళానిధి అధ్యక్షులు
9603698962



# బాల వికాసం

**ఆదిలాబాద్ జిల్లాలో జైనాథ్ మండలంలో గల కూర జడ్.పి.హెచ్.ఎస్. విద్యార్థులు కవితలతో పాటు కథలు, వ్యాసాలు రాస్తున్నారని ప్రధానోపాధ్యాయులు పి.అశోక్ తెలిపారు. పాఠశాలలోని ఉపాధ్యాయులందరు సాహిత్యంలో విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని విద్యార్థులు కూడా సాహిత్యంపట్ల మక్కువ చూపిస్తున్నారని తెలిపారు. ఈవారం కొన్నికథలు, కవితలు నేటినిజం పాఠకుల కోసం..**

–సంపాదకులు.



## అమ్మ

ఆనందాన్ని ఇచ్చేది అమ్మ
అందచందాల మా అమ్మ
కంటికి రెప్పలా కాపాడుతుంది అమ్మ
కష్టనష్టాలు భరిస్తుంది అమ్మ
కన్నీళ్లను దాచుకుంటుంది అమ్మ
ఒడిలో లాలిస్తుంది అమ్మ
పుట్టక ముందే ప్రేమించేది
మన అమ్మ.



**– యన్. దీపిక**
7వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్, కూర
జి: ఆదిలాబాద్
మం॥ జైనథ్

## స్నేహం

విడిపోని బంధం స్నేహం
భారమైన భరించేది స్నేహం
అమ్మనైన వదులుకునేది స్నేహం
కమ్మనైనది స్నేహం
కష్టాల్లో కన్నీళ్లు తుడిచేది స్నేహం
ఎన్నటికీ మరవలేని స్నేహం
ఆడుతూ పాడుతూ గడిపేది స్నేహం
సమయాన్ని కూడా మరచిపోయేది స్నేహం
ఎంతో బలమైనది ఈ స్నేహం
కష్టాలు, సుఖాలు పంచుకునేది స్నేహం
అమ్మలా తోడుండే స్నేహం
అందమైన మా స్నేహం
బంధానికి ఒక గొప్పపేరు స్నేహం.



**– జి. శ్రీజ**
7వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్

## గురువుగారు

నాకు అమ్మ నాన్నా తరువాత గురువుగారు
నాకు జీవితాన్ని నేర్పించింది గురువుగారు
నాకు ఆనంద విషయాలు నేర్పించింది గురువుగారు
నాకు ప్రపంచం తిరిగే అవకాశం ఇచ్చింది గురువుగారు
నాకు జ్ఞాన విజ్ఞానాన్ని నేర్పించింది గురువుగారు
నాకు ఆ సరస్వతి దేవితో సమానం ఈ గురువుగారు
నాకు జీవం పోసింది మా అమ్మ
జీవితం నేర్పించింది గురువుగారు
నాకు ఈ సృష్టిలో మించిన జ్ఞానాన్ని నేర్పించింది గురువుగారు.



**– సి.హెచ్. సాయిప్రియ**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్

## దీపావళి

మనకు సంవత్సరానికి ఒకసారి వస్తుంది ఈ పండుగ
మన పళ్ళెల్లో నిండుతుంది రంగుల కాంతి మయం
మనకు ఆనందాన్ని కల్పిస్తుంది ఈ పండుగ.

మన ఇంటిని ఆనందంగా అలంకరిస్తుంది ఈ పండుగ
మనకు పిండివంటలను తినిపిస్తుంది ఈ పండుగ
మన ఇంటి బయట ఆకాశంలో కాంతి ఈ పండుగ

మనకు కళ్ళల్లో కాంతి ఈ పండుగ
మనకు బంధువులలో ఆనందం ఈ పండుగ
మనం ప్రతీసారి ఎదురు చూసేది ఈ పండుగ కోసమే.

**– సి.హెచ్. సాయిప్రియ**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్

## చెట్టు

పచ్చ పచ్చనీ చెట్టువు
చల్లని గాలిని ఇస్తావు
వేసవి కాలం నీడవతావు
తియ్యని పండ్లు ఇస్తావు
రైతుకు ఆధారం నీవు
పిల్లలకు ఆట అవుతావు
వర్షానికి కారణం నీవు
భూమి తల్లికి స్నేహం నీవు
మాకు తోడు నీడ నీవు.



**– బి. అఖిల**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్

## పల్లె

పచ్చనైనది పల్లె
అనుబంధాన్ని పంచేది పల్లె
అందమైనది పల్లె
పచ్చదనంలో ఉండేది పల్లె
పరిమళాన్ని వెదజల్లేది పల్లె
అందమైన ప్రకృతిని పరిచయం చేసేది పల్లె
స్వచ్ఛమైన గాలిని పీల్చేది పల్లెలోనే
ప్రకృతి మాతను కాపాడండి
ఆనందంగా ఉండండి

## అమ్మ

వీచే గాలి కన్నా
పూచే పువ్వు కన్నా
విరిసిన నెమలి కన్నా
కురిసే చిరుజల్లు కన్నా
ఉదయించే సూర్యుడు కన్నా
పారే నీళ్ళ కన్నా
పచ్చపచ్చనైన చెట్ల కన్నా
అమ్మను మించిన అందం లేదు.
అమ్మను మించిన దేవత
ఈ సృష్టిలోనే లేదు.



**– ఎస్. శ్వేత**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్

## కవిత్వం

ఈ సృష్టిలో అందమైనది పువ్వు
నా దృష్టిలో అందమైనది మా అమ్మ నవ్వు
రైతు పంటను పండించడానికి ఎంత
నొప్పిని భరిస్తాడో
మనల్ని ఈ లోకానికి పరిచయం చేయడానికి
అమ్మ అంతే నొప్పిని భరిస్తుంది.
మనం ఎంత భారంగా ఉన్న మనల్ని
ఈ ప్రపంచానికి పరిచయం చేసేది
అమ్మ ప్రేమ
అమ్మ లేకుంటే లేదు ఈ జన్మ
అమ్మ ప్రేమ ఈ సృష్టిలో మిన్న.



**– ఎన్. అఖిల**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్



## వింతగ్రుహ

అనగనగా ఒక ఊరు. ఆ ఊరు పేరు అత్మాపురం. ఆ ఊరిలో ఒక గృహ ఉండేది. ఆ గృహలో దయ్యం ఉందని అందరూ నమ్ముతారు. ఒక కుటుంబం ఉండేది. ఆ కుటుంబం పేద కుటుంబం. ఆ కుటుంబంలో రాజయ్య వ్యవసాయం చేస్తాడు. ఒక రోజు రాజయ్య భార్య సోమాంబ అతని కొడుకు రాము. రాముకు ఒక రోజు చాలా ఆకలి వేసింది. ఇంట్లో కట్టెలు లేవు. రాజయ్య కట్టెలు తేవడానికి వెళ్లాడు. అలా వెళుతూ ఉండగా ఒక గుహ కనిపించింది. ఆ గుహలోకి వెళ్లాడు. ఎంత సేపయిన ఇంటికి రాలేదని సోమాంబ, రాము చాలా కంగారు పడ్డారు. చీకటి పడింది. రాము వాళ్ళ అమ్మ ఇద్దరు గ్రామ పెద్ద దగ్గరికి వెళ్ళారు. రాము మరియు వాళ్ళ అమ్మ గ్రామ పెద్ద ఇంకొందరు. అలా నడుచుకుంటు వెళ్ళారు. వాళ్ళకు ఒక గుహ కనిపించింది. రాము అందులోకి వెళ్ళాడు. రాముతో వాళ్ళందరు వెళ్ళారు. గుహలో వింత శబ్దాలు వినిపించాయి. దయ్యం వచ్చింది. అయినా రాము భయపడలేదు. దయ్యం వెళ్ళిపోయింది. దయ్యంతో వాళ్ళు కూడా వెళ్ళారు. అక్కడ అందరూ తప్పిపోయిన వారు కనిపించారు. రాము వాళ్ళ నాన్న దగ్గరకు వెళ్ళి ఆనందించారు. నువ్వు ఎందుకు ఇలా చేసావు అని గ్రామ పెద్ద అడిగాడు. ఈ గుహలో బంగారం ఉంది. కావున ఇలా చేశాను అని చెప్పింది. గ్రామ పెద్ద శిక్షను ఆ దయ్యంకు విధించాడు.

నీతి: మనది కానిదానికి
ఆశ పడకూడదు.

**– జి. శ్రీజ**
7వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్

## స్నేహం

విడిపోలేని బంధం స్నేహం
భారమైన భరించేది స్నేహం
అమ్మ ప్రేమలా ఉండేది స్నేహం
కమ్మనైనది స్నేహం
కష్టాల్లో కనీళ్ళు తుడిచేది స్నేహం
ఎన్నటికీ మరువలేనిది స్నేహం
ఆడుతూ పాడుతూ గడిపేది స్నేహం
సమయాన్ని కూడా మరచిపోయేది స్నేహం
బంధానికి ఒక గొప్ప పేరు స్నేహం
స్నేహమేరా జీవితం
స్నేహమేరా శాశ్వతం.



**– ఎం. అనూష**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్

## ఆశ

అందరితో ఉండాలని ఆశా
ఆకాశంలో ఎగరాలని ఆశ
ప్రతి క్షణం సంతోషంగా ఉండాలని ఆశ
సీతాకోక చిలుకగా రంగు రంగు రెక్కలతో
ఆకాశంలో విహరించాలని ఆశ
అమ్మ నాన్నలతో ఆడుకోవాలని ఆశ
ప్రపంచాన్ని చుట్టి రావాలని ఆశ
అందంగా ఉండాలని ఆశ
అందం అనేది ఒక వరం
అంతులేని సౌందర్యం
ప్రపంచానికి పరిచయం.



**– జి. తేజశ్రీ**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్

## నాన్న

నాన్నలేనిదే మన జన్మలేదు
నాన్నే మన జీవితం

కష్టాల్లో తోడుండేది స్నేహితుడు
ఆ స్నేహితుడే మా నాన్న

మా నాన్న ఎల్లప్పుడూ నా తోడు నీడ
అందుకే మా నాన్ననంటే నాకిష్టం.



**– అప్సాస్ దివ్యవాణి**
10వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్



## భూమన్న- నర్సమ్మ

ఒక ఊరిలో భూమన్న అతని భార్య నర్సమ్మ ఉండేవారు. వారికి ఒక కూతురు పుట్టింది. వాళ్ళ కూతురి పేరు మౌనిక. వీళ్ళు ఇద్దరూ కూలి చేసుకుంటూ బతికేవారు. ఒకరోజు వాళ్ళ పాప ఆడుకుంటు ఉంది. అప్పుడు భూమన్న చేన్లోకి, నర్సమ్మ నీళ్ళకోసం వెళ్ళారు. మౌనిక ఆడుకుంటూ ఒక పామును చూసింది. అప్పుడు ఆ మౌనిక చిన్న పాప. పామును ఆమె తన చేయితో కొట్టింది. పాముకు కోపం వచ్చి మౌనిక పాపను కాటువేసింది. ఆ పాప అక్కడే పడిపోయింది. అక్కడ ఒక ఎలుక బియ్యాన్ని తింటూ ఉంది. వాళ్ళ అమ్మ వచ్చింది. ఆ ఎలుకనే మా పాపను కొరికిందని ఎలుకను చంపేసింది. మౌనిక చేతుకు పాము కుట్టింది. దీనిని గ్రహించిన నర్సమ్మ తన తప్పును తెలుసుకుంది.

**ఇందులో నీతి ఏమంటే ఎప్పుడూ ఆలోచించకుండా పని చేయకూడదు అని అర్థం.**



**– ఎన్. దీపిక**
7వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్

## ఉప్పు గురించి కథ..

అనగనగా ఒక ఊరిలో అన్నాదమ్ములు ఉండేవారు. వారిద్దరి పేరు రాము, శ్యాము. శ్యాము చాలు డబ్బులు సంపాదించేవాడు. రాము తినడానికి నానా కష్టాలు పడేవాడు. ఒక రోజు రాము శ్యాము దగ్గరికి వెళ్ళాడు. శ్యాము నీ దగ్గర డబ్బులు ఉంటే ఇవ్వు అన్నాడు. నాకు మన కుటుంబానికి తినడానికి తిండి కూడా లేదు అని అన్నాడు. రాము కష్టాన్ని చూసి ఒక పెద్దాయన ఒక ఉపాయం చెప్పాడు. ఏమని చెప్పాడంటే బాబు నీ కష్టాన్ని తీర్చడానికి నేను ఒక ఉపాయం ఆలోచించాను . రాము అన్నాడు ఏమిటి అది చెప్పు పెద్దాయన. నువ్వు ఒక రాయిని విసురు అని చెప్పాడు. అయితే రాము రాయిని విసిరాడు. అయితే రాకి ఒక చిన్న 'ఎరుపు' బట్టకట్టమని అన్నాడు అయితే రాము కట్టాడు. పెద్దాయన ఏం చెప్పాడంటే నువ్వు నీ మనసులో ఉన్న కోరిక కోరుకో అని చెప్పాడు. రాము కోరుకున్నాడు. ఆ కోరిక నెరవేరింది అయితే రాము చాలా ఆనందంగా ఉన్నాడు. అప్పటి నుండి రాము కోరుకున్న కోరికలు నెరవేరాయి. రాము ధాన్యాలు, పప్పు దినుసులు కోరాడు. అయితే ఆ విసురాయి నుంచి అవి వచ్చాయి. రాము శ్యాము కన్నా ఎక్కువ డబ్బు సంపాదించాడు. అది చూసి శ్యాముకి చాలా కోపం వచ్చింది. శ్యాము రాము ఇంటికి వెళ్ళి చూసాడు రాము కోరుకునే ఆ విసురాయిని ఎలా అయినా దొంగలించాలి అనుకున్నాడు. శ్యాము తన ఆస్తులు మొత్తం అమ్ముకొని ఆ విసురాయి కోసం చూసాడు. శ్యా వాళ్ళ భార్య అతన్ని ఒకరోజు తిట్టింది.

"“ఒక రోజు శ్యాము పడవలో ప్రయాణించడానికి వెళ్తున్నాడు. అయితే అతని భార్య కూడా అతనితో వెళ్ళింది. అతని భార్య శ్యాముతో ఈ విసురాయి ఎక్కడది అని అదిగింది. శ్యాము అన్నాడు ఇది నాకు దొరికింది అన్నాడు. శ్యాము భార్య అడిగింది దీంతో మనకు ఏమిటీ లాభం అని అడిగింది. శ్యాము అన్నాడు మనం కోరుకున్న కోరికలు నెరవేరుతాయి అన్నాడు. అతని భార్య శ్యాముతో అన్నది నువ్వు ఏం కోరుకుంటున్నావు అడిగింది. శ్యాము అన్నాడు ఉప్పు రావాలని కోరుకున్నాడు. అయితే ఉప్పు వచ్చింది ఆ విసురాయిని ఎంత ఆపాలన్నా ఆగలేదు అయితే ఆ విసురాయి సముద్రంలో పారేసాడు. దీని వలన సముద్రంలోని నీరు మొత్తం ఉప్పుగా మారింది. అయితే దీని వల్ల సముద్రంలో ఉప్పు ఉన్నదన్న ఓ చిన్న నమ్మకం”

నీతి: ఎవ్వరిని తక్కువ అంచగా వేయకూడదు. ఎంత ధనవంతులైన, పేదవాడైనా ఈ సమాజంలో మరియు ఈ ప్రకృతికి అందరూ సమానులే..


**– ఎస్. శ్వేత**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్

## తెలుగు గొప్పతనం

కూర అనే గ్రామములో ఒక పాఠశాలలో విద్యార్థులు ఇతరులతో అసహ్యంతో ప్రవర్తించేవారు. ఆ సమయంలో ఉపాధ్యాయ బదిలీలు జరిగాయి అప్పుడు కూరకు బదిలీ అయినా బదిలీ అయినా ఉపాధ్యాయులు వచ్చారు మొదటి రోజు ఉపాధ్యాయులు కూర పాఠశాలకు వచ్చారు. అప్పుడు ఒక విద్యార్థి కూర ఉపాధ్యాయులకు నమరస్కరించలేదు. మరుసటి రోజు పాఠశాలకు రంగులు వేయిద్దమని తెలుగు టీచర్ చెప్పారు. పాఠశాలలో భారతమాత బొమ్మను, సరస్వతి బొమ్మను వేయిస్తే బాగుంటుంది అని తెలుగు ఉపాధ్యాయుడు అనుకున్నాడు అనుకున్నట్టే బొమ్మలు వెయించారు. అప్పుడు ఆ విద్యార్థులు ఆ బొమ్మలను చూసి చూశార వీడికి దేశభక్తి బాగాబానే ఉంది అని ఉపాధ్యాయుడిని అన్నారు. ఆ తరువాత రోజు తెలుగు ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పడానికి తరగతికి వస్తే టీచరు మాకు మీలాగ తెలుగు భాష వెలుగు, తెలుగు అంటే అమ్మ పలుకు అని అనుకున్నారేమో మాకు తెలుగు అంటే చిరాకు అని అన్నారు. అప్పుడు తెలుగు ఉపాధ్యాయుడు అన్నాడు తెలుగు అంటే చిరాకు మీకు పుట్టి పెరిగి మొదటిగా అమ్మా అని అందంగా పలికే పదం తెలుగుపదం. తప్పటడుగులు వేసి కింద పడితే అమ్మ దెబ్బతాకింది అని అన్నపదం తెలుగు పదం జీవితంలో ఎన్ని బాధలున్న ఎంత ఆనందమున్న దానిని వ్యక్తపరచడం మాత్రం తెలుగు భాషలో. కాని మీకు తెలుగంటే చిరాకు కదా! ఎందరో మంది మాకు మాతృభాష లేదు అంటు కొట్టుకు చస్తున్నారు. కాని మనం మాతృభాష అహంకారంతో తెలుగు భాషను లోకువ చేస్తున్నాం అని ఉపాధ్యాయుడన్నాడు. తప్పు తెలుసుకున్న విద్యార్థులు అందరికీ క్షమించమని బాధపడ్డారు.



**– జి. తేజశ్రీ**
9వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్



## స్నేహ బంధం

మన జీవితంలో ఎంతో మంది వస్తుంటారు పోతుంటారు
కాని శాశ్వతమైనది స్నేహం ఒక్కటే.

మన ప్రతి కష్టంలోనూ, బాధలోనూ, ఆనందంలోనూ
సంతోషంలోనూ ఎల్లప్పుడు మన తోడుంటే వాడే స్నేహితుడు

ఏ బంధం ఉన్న లేకున్న స్నేహ బంధం ఉండాలి
అమ్మ ప్రేమలా మనల్ని లాలిస్తుంది.

స్నేహమేరా జీవితం
స్నేహమేరా శాశ్వతం

**– అప్సాస్ దివ్యవాణి**
10వ తరగతి
జడ్.పి.హెచ్.ఎస్. కుర
మం: జైనథ్, జి॥ ఆదిలాబాద్



అక్టోబర్ 20న చిమ్మపూడి ఫౌండేషన్ నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొని డా॥కె.వి. రమణాచారి చేతులమీదుగా సత్కారాన్నందుకుంటున్న పొత్తూరి సుబ్బారావు. చిత్రంలో విన్నకోట మురళీకృష్ణ, డా॥ఏనుగు నరసింహారెడ్డి, చిమ్మపూడి శ్రీరామమూర్తి తదితరులు.

నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

గురువారం 31-10-2019 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | హైదరాబాద్ 3

**నమ్మలేని నిజాలు**

ఆకలి కేక
అల్లుడినోట్లో శని
ఉండి దొరకదు

చదివింది వేరు
తగింది కుదరదు
శిక్షణకు శిక్ష

తీవ్రవాద సర్పం
రక్తసిక్త చీమలు
పుట్ట కోటకు

స్పేస్‌లో నడక
మహిళా పురోగతి
అన్నిట్లో సగం

సమ్మె సమ్మెట
సాగని బండి చక్రం
మొండికి గండి.



– రేడియమ్
9291527757

**శ్రీనిజాలు**

ఆర్టీసీ సమ్మెపైన
ఇంత మొండి పట్టు సరా!
ఆఖరుకూ సర్క రోడ
అనిపించుకున్నావ్ దొరా!

చర్చలు జరుపనీయండి
చస్తున్నరు పిల్లలు!
బతుకుకి భరోసా లేదు
నీ మాటలు కల్లలు!



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## అమానుషం..

పేరుకు...
కీర్తి అయితేనేం?
అమ్మంటే
దైవంగా భావించే లోకంలో..
కూతురుగా
అపకీర్తిని మూటకట్టుకున్నావు!
కట్టు తప్పిన నిన్ను
అమ్మగా కట్టడి చేస్తే
ప్రియునితో చెట్టాపట్టాలేస్తూ..
ఆమెనే..
గుట్టుగా మట్టుపెట్టావు!
కనిపెంచి కంటికి రెప్పలా..
కాపాడుతూ పెద్ద చేసిన తల్లిని
నిర్ధాక్షిణ్యంగా మట్టుబెట్టి
రైలు పట్టాలపై విసిరేశావు..!

నీతిమాలిన వలలో చిక్కి..
నీ బంగారు భవితకు
సమాధి కట్టుకున్నావు!
ఒట్టేసి చెబుతున్న..
నీలాంటి బిడ్డలు పుట్టినా
గిట్టినా ఒకటే..!

(హైదరాబాద్‌లో తల్లిని
చంపిన కూతురు
ఘటనకు స్పందనగా..)



–దాస్యం సేనాధిపతి
94405 25544

## మరో పార్శ్వం

ఇన్నేళ్ళ నుంచీ
ఇన్నాళ్ళ నుంచీ
నాకు ప్రతి స్త్రీలో
అమ్మే కన్పించేది
ఆమె దైవత్వమే
దర్శనమిచ్చేది
ఆమె కన్నుల్లో వాత్సల్యం
ఆమె హృదయంలో కారుణ్యం
ఆమె అనిర్వచనీయ ప్రేమమూర్తి
'న మాతుః పరదైవతం, వేదసూక్తి
ఇన్నేళ్ళ తర్వాత
ఇన్నాళ్ళ తర్వాత
ఇదేమిటి!
స్త్రీలో నరరాక్షసి!
జాలీ రూపంలో
రక్తం తాగే పిశాచి
ఇంటికి దీపంగా వెలగవలసిన ఇల్లాలు
ఇంటికే నిప్పు పెడుతుందని ఎవరనుకున్నారు!
కుటుంబాన్ని అమ్మలా లాలించవలసిన మహిళ
కుటుంబానికే 'సైనైడ్, కలిసిన అన్నం
పెడుతుందని
ఎవరనుకున్నారు?
రక్త సంబంధాలు
మానవీయ బంధాలూ
మరచిపోతుంది
జాలిలేని
జాలీ
ఆస్తికోసం
హత్యలు చేసింది
మృగమైంది
కామ మృగమైంది
బంధాలను మరచిపోయింది
అక్రమ సంబంధాలను ఆశ్లేషించుకుంది
రాక్షసత్వం పైశాచికత్వం
జాలీ
నీచత్వం కఠినత్వం
జాలీ
మానవత్వానికి మచ్చతెచ్చినదానివి
అతివ ఔన్నత్యాన్ని రక్తంలో తడిపిన పిశాచి
జాలీ
ఎల్లవేళలా స్త్రీకి జేజే అని పలికే నేను
ఇవాళ ఈ జాలినిచూచి
ఛీఛీ అంటున్నాను
సిగ్గు పడుతున్నాను
సిగ్గుపడుతున్నాను.

(కేరళ–కొచ్చిన్‌లో ఆస్తికోసం
భర్తను, అత్తమామలను,కన్న బిడ్డను
బంధువులను కడతేర్చిన నరరూప
రాక్షసి జాలి జోసెఫ్ గూర్చి
పత్రికలలో వార్త చదివి
స్పందించి..



– డా॥ తిరునగరి
93924 65475


## పదచిత్రం

నిశ్శబ్దంగా పలికే మనసుగీతం వింటున్నావా
ఎక్కడెక్కడి శ్రోతలను జ్ఞాపకాల్లా పోగేస్తుంది
పగలూరేయీ తేడాలేని పరుగు
ఉనికి లేని ప్రశ్నల సమాహారం లా ఉంది

నీరసించిన జీవితాలు నీడల్లా పాకుతుంటే
చీమలను దులిపే దుప్పటిలా ప్రపంచం నిర్దయి
నిర్ణయాలను చిలికి కషాయంలా తాగిస్తుంది
చుట్టూ నిలువుదోపిడీల సాగరఘోషే

సరిహద్దురేఖల సమాలోచనల్లా
దివారాత్రాలు కూడబలుక్కుని
అసమానతల గోడలతో
నిషిని సమాధిచేస్తుంటే
ఊగిసలాడుతూ మంచితనపు ఒంటరిపడవ

మనసుగీతం మొరాయించింది
భరించలేని ఆలోచనలు భళ్ళుమంటుంటే
ఒంటరి నడకను ఆశ్రయించింది
మట్టిని తడిమే పాదాలతో
పదచిత్రాలను పూయిద్దామని



–సి.యస్.రాంబాబు
9490401005

## అతడు లేని ఆమె

తన బతుకులో ఇంకా...
ఏమీ మిగలలేదు
రవ్వంత సంతోషం లేకపోయాక
ఏమి మిగిలినట్టూ..!?
నవ్విస్తానన్నవాడె
ఏడుపుకొండను నెత్తినెత్తి పోయాడు
తోడొస్తానన్నవాడె
ఒంటరిని చేసి శూన్యంలోకి నెట్టిపోయాడు
దాంపత్యాన్ని
వేడుక చేస్తానన్నవాడె..
శాశ్వతంగా ఏడిపించి పోయాడు..!

ఆమెకింకా
ఏమీ మిగలనట్టే..!
నుదుటన చిటికెడు కుంకుమే సౌభాగ్యం
అదే చెరిగిపోయాక...
ఆమె జీవితనావకు ఆనందాలతెరచాప చిరిగిపోయినట్టే
వేర్లు లేని చెట్టు
చిరుగాలికైనా లోకువైనట్టే
భర్తలేని భార్య అర్భకుడికైనా అలుసే...!
పిలవడానికి మంచిపేరున్నా
విధవరాలన్న ముల్లుతోనే లోకం గుచ్చుతుంది!

దిగులువూబిలో పడి
గిలగిలలాడే నిస్సహాయికై
నిముసమొక నరకంగా గడపాల్సిందే..!
ఆమె కంటిమేఘాలు
నిరంతర దుఃఖవర్షాన్ని కురుస్తానే వుంటాయి
ఓదార్చే గొంతు కరువైతే
గుండె వేదనతో కుంగి కృశించాల్సిందే..!

స్త్రీకి సిరి భర్తే
అతడు లేని ఆమెను
లోకం వివక్షపాల్జేస్తుంది...!
దారిలో ధైర్యం చేసి నడవడానికి
ఆమె చరణాల్లో వణుకుపుడుతుంది!

భర్తమరణంతో
ఆమె జీవితంలోకి కటికచీకటి కమ్ముకుంది
ఇక ఆమెమోములో నవ్వువెలుగు
ఓ జన్మకాలానికి ప్రసరించనంత దూరమే..!

(భర్తని కోల్పోయిన
స్త్రీల దుఃఖానికి చలించి)



–మెట్టానాగేశ్వరరావు
9951085760

మెత్తనివే కదా అనీ
చులకనగా చూడకండీ !
కోరలు లేని నీళ్లు
కొరికీ కొరికీ...
బంధీ చేసిన గట్టుని నరుకుతాయి.

అముద్రిత కావ్యం
'ఒక బైరాగి పాట'లోంచి.
-మునిమడుగుల ఫిలాసఫీ.


## ఘనపురం 'ముచ్చట' కవితా సంకలనం ఆవిష్కరణ



రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో మంగళవారం 'ముచ్చట' కవితా సంకలనం ఆవిష్కరణలో అతిథులు.

ఘనపురం దేవేందర్ రచించిన 'ముచ్చట' కవితా సంకలనాన్ని ప్రముఖ కవి, సరస్వతీ సమ్మాన్ పురస్కార గ్రహిత కె.శివారెడ్డి ఆవిష్కరించారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరం (గురు భాస్కర సేనాపతి భాష్య కాచార్య వేదిక)లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఘనపురం దేవేందర్ కదిలించే కవి. కన్నీళ్ళను విశ్వభాషగా చేసిన ఆయన కవిత్వం చిరకాలం నిలిచిపోతుంది అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా॥నందిని సిధారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ అలంకారం, చమత్కారం, ధిక్కారం దేవేందర్ కవిత్వంలో కనబడతాయన్నారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక అధికారి దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్య చైతన్యంతో అందిరినీ కలుపుకుని సాహిత్య విస్తృతికి కృషి చేస్తున్నాడని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అయాచితం శ్రీధర్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, జలపాతం సంపాదకులు సి.హెచ్. మధు అతిథులుగా పాల్గొని ఘనపరం దేవేందర్ సాహితీ వ్యక్తిత్వాన్ని ఘనంగా ఆవిష్కరించారు.

## సమకాలీన జీవితానికి చిత్రిక 'నానీల మణిహారం'






చిట్టి చిట్టి మాటలతో, ముచ్చటైన నాలుగు పాదాలతో వచన కవిత్వంలోకి నవ వెలుగులను ప్రసరింపజేసిన నవ్య కవితామార్గం నానీలు. రెండు దశాబ్దాల క్రితం ఆచార్య ఎన్.గోపి ప్రారంభించిన ఈ కవితామార్గం ఎందరో నవ కవులను ఆకర్షించింది. కవిత్వ రచనకు ప్రేరేపించింది. కవులుగా తీర్చిదిద్దింది. అభిప్రాయ ప్రకటనకు వేదికగా నిలిచింది. నవ కవులతో పాటు అప్పటికే కలం పట్టినవారిని కూడా ఈ ప్రక్రియ ఆకర్షించింది. ఆచార్య గోపి మార్గంలో వేయి మందికి పైగా కవులు నానీల రుచిని పాఠకులకు చూపించారు.

ఈ నానీల ప్రక్రియలో కవిత్వాన్ని వెలువరించిన వారి వరుసలోకి చేరారు డా.ఎం.దేవేంద్ర. 'తెలంగాణ కథ– వర్తమాన జీవన చిత్రణ' అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టా అందుకున్న దేవేంద్ర తన కవిత్వంలోనూ వర్తమాన జీవితాన్ని చిత్రించారు. 'నానీల మణిహారం' సంపుటి అందుకు ఉదాహరణగా నిలుస్తుంది. నాలుగు పాదాల ఈ కవితా ప్రక్రియలో సమకాలీనతను చిత్రిక పట్టారు దేవేంద్ర.

తెలుగు భాషకు సంబంధించిన సాహిత్య ప్రక్రియపై పరిశోధన చేసిన దేవేంద్రకు భాష విషయంలో స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. తెలుగు భాషను ప్రాణవాయువుగా భావిస్తారు దేవేంద్ర. అందుకే 'ఆకాశ విస్తృతి/ ఆంగ్ల భాషకుండొచ్చు/ నాకు ఆక్సిజన్నిచ్చేది/ తెలుగు భాషే' అంటారు. చిన్నారుల పలుకుల్లో భాష ముద్దులొలుకుతుంది. అప్పుడప్పుడే మాటలు నేర్చుకుంటున్న కొత్త తరం భాష మాటకు సౌందర్యాన్ని అద్దుతుంది. అందుకే **'మాతృభాష/ పుట్టుక ఎక్కడ?/ పసిపాప జిలిబిలి పలుకుల్లో'** అని ముద్దు మాటల సౌందర్యాన్ని గుర్తుకుతెస్తారు. తెలుగులో నిష్ణాతులైనప్పటికీ ఇతర ప్రాంతాలకు చెందినవారితో సంభాషించాలంటే హిందీ, ఇంగ్లీషు వంటి భాషల పరిజ్ఞానం తప్పనిసరి. అందుకే **'ఆఖరికి / ఇలా మిగిలాను / తెలుగును ప్రేమిస్తూ / ఆంగ్లాన్ని అనుసరిస్తూ'** అని ఆంగ్లంతో పరిచయమూ నేటి విద్యార్థులకు తప్పనిసరి అనే విషయాన్ని తేటపరుస్తారు.

దేవేంద్ర కవిత్వంలో ఎక్కువగా కనబడే అంశాలు ఆర్ట్స్ కళాశాల, తెలంగాణ. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకుని, తెలంగాణ ఉద్యమంలోనూ పాల్గన్న దేవేంద్ర కవిత్వంలో ఈ రెండు అంశాలూ ఉండడం వింతేమీ కాదు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ వంద సంవత్సరాల ఉత్సవాలను ఇటీవల జరుపుకుంది. తెలుగు శాఖ సెంచరీ కొట్టిన సందర్భాన్ని **'వందేళ్ల తెలుగు శాఖ/ వెలుగుల ప్రయాణం/ సూర్యకిరణం/ సాక్షిగా'** అంటారు. తెలుగు శాఖ వంద సంవత్సరాల ప్రయాణం వెలుగులు విరజి మ్మిందని పేర్కొంటారు దేవేంద్ర. తెలుగు సాహిత్యలోకానికి వెలుగులను అందజేసి రవి పాత్ర పోషించింది తెలుగు శాఖ. ఈ వందేళ్ల ఉత్సవాలు 'సూర్యకిరణం' సాక్షిగా జరిగాయని అనడంలో సూర్యుడి సాక్షిగా అంటూనే, ఆ శాఖ అధ్యక్షురాలు ఆచార్య 'సూర్య' ధనంజయ్ సారథ్యంలో జరిగాయని పేర్కొనడం ఈ పాదాల అంతరార్థం.

ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల చదువుల కేంద్రం. నిరంతరం విద్యార్థుల కేరింతలు, తుళ్లింతలకు ఆలవాలమైన విద్యాసముదాయం. అక్కడ చదువుకున్న ఎందరో ప్రపంచవ్యాప్తంగా జ్ఞాన పరిమళాలను వెదజల్లారు. అందుకే **'ఆర్ట్స్ కాలేజీని / తాకి చూడు / విద్యాగంధాన్ని / విశ్వవ్యాప్తీకరిస్తుంది'** అంటారు దేవేంద్ర. విద్యతో పాటు విద్యార్థులను ఉద్యమోన్ముఖులను చేసిన రణస్థలి ఆర్ట్స్ కళాశాల. అందుకే **'పాటలతో ఉద్యమం / పాఠాలతో విద్య / ఆర్ట్స్ కాలేజీ / ఓ చంపూ కావ్యం'** అని ఉద్యమ స్ఫూర్తిని అందజేస్తూ, విద్యావ్యాప్తి చేసిన జమిలి కార్యక్రమాల నిలయంగా ఆర్ట్స్ కళాశాలను వర్ణిస్తారు.

తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం గణనీయమైన పాత్ర పోషించింది. అందుకే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత విజయోత్సవ సంబరాలను ఘనంగా జరుపుకుంది. ఈ సందర్భాన్ని కవితారూపంలో వ్యక్తీకరించారు దేవేంద్ర. **'ఆర్ట్స్ కాలేజీ ముఖంలో / నవ్వు / తెలంగాణ ప్రకటన / చెవిన పడిందని'** అంటూ ఆర్ట్స్ కళాశాలకు మానవ రూపారోపణ కల్పిస్తారు.

తెలంగాణ జాతిపితగా పేర్కొనే ఆచార్య జయశంకర్‌ను ప్రస్తావిస్తూ **'జీవితమంతా / తెలంగాణమే / జయశంకర్ సార్ / బంగారు నాణెమే!'** అంటారు దేవేంద్ర. నూతనంగా 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. ప్రజలకు నూతన రాష్ట్రంపై కోటి ఆశలున్నాయి. అంతకంటే ఎక్కువగా సమస్యలూ ఉన్నాయి. సమకాలీన చరిత్రకు ఈ కవయిత్రి కూడా సాక్షి. అందుకే **'కోటి ఆశలు / శతకోటి సమస్యలు / తెలంగాణ / రాయబడుతున్న ప్రజాకావ్యం'** అని చెప్తారు దేవేంద్ర.

ఎదిగిన పిల్లలు అందివచ్చిన తర్వాత అందుబాటులో ఉంటూ ఆసరాగా నిలుస్తారని తల్లిదండ్రుల ఆశ. కానీ నేటి కాలంలో రెక్కలు వచ్చిన తర్వాత పడమటి తీరాన్ని వెతుక్కుంటూ వలస బాట పడుతున్నాయి యువ పక్షులు. బంధాలకు దూరంగా, కేవలం డబ్బులు పంపడమే బాధ్యతగా భావించే నవతరం వైఖరిని ఈ కవయిత్రి సున్నితంగా విమర్శిస్తారు. **'డాలరుకు దగ్గరయ్యావు / సమీపం సరే / అనుబంధాలకే / దూరం దూరం'** అంటారు. దేశం వెలుపలికి వలసల బాట పట్టడం డబ్బు సంపాదనకు ఒక మార్గమే గానీ అయినవాళ్లకు దూరం చేస్తుంది. అందుకే **'విదేశాల్లో ఉద్యోగం / గిట్టుబాటే / కాని తల్లిదండ్రులతో / ఎడబాటు'** అంటారు దేవేంద్ర. ఉపాధి వెతుకులాటలో విదేశాలకు రవాణా అయిపోయిన పిల్లల తల్లిదండ్రుల కేరాఫ్ అడ్రస్సు వృద్ధాశ్రమమే. అందుకే **'కొడుకు అమెరికా / కూతురు లండన్ మరి నువ్వు? / ఓల్డేజ్ హోమ్‌కు'** అని ఆ తల్లిదండ్రుల చిరునామాను చూపిస్తారు.

నిరంతరం పరుగుల జీవన సమరంలో మనిషి తనను తానే మర్చిపోయాడు. జీవిత ఆటుపోట్ల చక్రభ్రమణంలో తనను తాను కోల్పోయాడు. తన ఉనికిని తానే జ్ఞప్తికి తెచ్చుకోవలసిన తరుణంలో మనిషి నేడు ఉన్నాడు. ఈ పరిస్థితిని చక్కగా పేర్కొన్నారు దేవేంద్ర. **'దేనిని / వెతుకుతున్నాడతడు? / బహుశా / తననే కావచ్చు'** అంటారు. జీవిత పరుగు పందాన్ని విశ్లేషిస్తూ **'రోజుకు ఇరవై నాలుగు గంటలే / కాలం మారలేదు / మారింది / మనిషే'** అంటారు.

ప్రపంచీకరణ వల్ల దుష్పరిణామాలను కూడా తన కవిత్వంలో వివరించారు దేవేంద్ర. గ్లోబలీకరణ ఫలితంగా దేశీయ ఉత్పత్తులు మరుగునపడిపోయాయి. అమెరికా ఉత్పత్తులకు అంగడిగా మారిపోయింది భారత కుగ్రామం.

> చిట్టి చిట్టి మాటలతో, ముచ్చటైన నాలుగు పాదాలతో వచన కవిత్వంలోకి నవ వెలుగులను ప్రసరింపజేసిన నవ్య కవితామార్గం నానీలు.

ఈ పరిణామాన్ని పేర్కొంటూ **'నా పల్లెల్లో కూడా / ప్రపంచీకరణ / మజ్జిగకు బదులు / పెప్సీల ఆగమన'** అంటారు. ప్రపంచీకరణను ఇంత చిన్న వాక్యాల్లో, అరటిపండు ఒలిచిపెట్టినట్టు కవితారూపంలో పేర్కొన్నవారు అరుదు. ఆ అరుదైన కవులు జాబితాలోకి చేరిపోయారు దేవేంద్ర. ప్రపంచీకరణ వల్ల దేశీయ ఉత్పత్తులతో పాటు దేశీయ మార్కెట్లు కూడా అంతరించిపోతున్న అంశాల లిస్టులో క్రమేపీ స్థానం సంపాదించుకుంటున్నాయి. వాల్‌మార్ట్ మార్కెట్లు మూలమూలనా ఫ్రాంచైజీలు నెలకొల్పుతున్న పరిస్థితిని విస్పష్టంగా పేర్కొన్నారు దేవేంద్ర. **'గల్లిగల్లికో / సూపర్ మార్కెట్టా! / మరి చిల్లరకొట్టు / పవర్‌కట్'** అంటూ తన అభిప్రాయాన్ని చెప్పారు.

ప్రపంచీకరణ వల్ల మార్కెట్‌వైపు ప్రజలను ఆకర్షించడం ఎక్కువైంది. ఈ ఆకర్షణలు, ఎరల ఫలితంగా అవసరం ఉన్నా లేకపోయినా వస్తువులను కొనుగోలు చేయడం నిత్యకృత్యంగా మారింది. అలాంటి ఆకర్షణల్లో ఒకటి 'ఒకటి కొంటే ఒకటి ఉచితం' అనే ఆఫర్. రేటును రెట్టింపు చేసి, ఒక వస్తువు కొంటే మరో వస్తువు ఉచితమని పేర్కొనే మార్కెటు మాయాజాలాన్ని బట్టబయలు చేశారు దేవేంద్ర. **'ఆషాఢ మాసం / షాపులో ఆఫర్ / ఆలోచించు / రేటు మాత్రం 1×2'** అని విమర్శిస్తారు.

ప్రపంచీకరణ సమాచార విప్లవాన్ని వ్యాప్తి చేసింది. సమాచార విప్లవం వివిధ ప్రాంతాలకు చెందినవారు ఒక్క క్లిక్‌తో మాట్లాడుకునే సౌలభ్యం కల్పించింది. ప్రపంచం మొత్తాన్ని కుగ్రామంగా మార్చివేసింది. మనుషుల సౌకర్యార్థం రూపొందిన సెల్ ఫోన్ నేడు కేవలం మాటలకే పరిమితం కాకుండా హస్తభూషణంగా మారి ంది. నేడు ఇంటింటా సెల్ ఫోన్ రంగప్రవేశం చేసి, సామాన్యులకూ చేరువయ్యింది. ఆరో ప్రాణంగా మారిపో యింది. మాంత్రికుడి ప్రాణాలు చిలుకలో ఉన్నట్టు నేడు మనుషుల ప్రాణాలు సెల్ ఫోన్‌లో బందీ అయ్యాయి. మనిషి కాలాన్ని హరించివేసే ఈ ఆధునిక సమాచార మారణాయుధంపై దేవేంద్ర కవితాబాణం ప్రయోగిం చారు. **'సెల్ ఫోన్ నేడు / ఆరోప్రాణం / పంచప్రాణాలు / విలవిల్లాడుతున్నాయి'** అనే తన అభిప్రాయాన్ని వెల్లడిస్తారు.

మొదట్లో టీవీలు పిల్లల కాలాన్ని హరించేవి. నేడు ఆ స్థానాన్ని పూరిస్తున్నాయి కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు. ఈ రెండిట్లో ఆటలు పిల్లలను మైదానాలకు దూరం చేశాయి. ఆటలంటే అరచేతిలో ఆడుకునేవిగానే నేటి తరం భావిస్తోందేమో! శారీరక, మానసిక ఉన్నతికి బాటలు వేసే క్రీడలను నేటి పిల్లలు మర్చిపోతున్న తీరును కూడా ఈ కవయిత్రి ప్రస్తావిస్తారు. **'ఆటపాటల / ఆట విడుపులా? / నేటి పిల్లలకు / కంప్యూటరే సర్వస్వం'** అని పేర్కొంటారు.

దేవేంద్ర కవిత్వంలో అక్కడక్కడా భాషా చమత్కారాలతో పాటు భావ చమత్కారాలు పాఠకుడిని ఆకర్షిసాయి. **'ఏ.సి.లో ఉన్నప్పుడు / చల్లగానే ఉంది / బిల్లు కడుతున్నప్పుడే / చెమటలు పట్టాయి'** మొదలైన పాదాలు అందుకు ఉదాహరణగా నిలుస్తాయి.

ఎన్నో జీవిత సత్యాలకు కూడా తన కవిత్వంలో చోటు కల్పించారు దేవేంద్ర. **'పరిమళమే / పువ్వుకు ఆదరణ / మంచితనం / మనిషికి / అలంకరణ', 'పాకం వల్లే / కూరకంత రుచి / జీవితమూ అంతే! / కష్టాల్లో కాల్తే శుచి', 'దేహాన్ని / ప్రాణం నడిపిస్తుంది / ధనమే ప్రాణమైతే / మానవత నశిస్తుంది', 'నీరు లేనిదే / చేప ఈదలేదు / కన్నీళ్ళు రాల్చనిదే / జీవితం సాగలేదు'** మొదలైన ఎన్నో జీవిత సత్యాలను నానీల్లో పేర్కొన్నారు ఈ కవయిత్రి.

దేవేంద్ర కవిత్వంలో అనుభూతులు తళుక్కుమంటాయి. సూటిగా, చిక్కగా చెప్పడం కనబడుతుంది. **'ఆభరణాలు / అలంకారాలు / ఎక్కువయితే / వికారాల సంకెళ్ళే'** అనేది ఈ కవయిత్రి నిశ్చిత అభిప్రాయం. ఈ అభిప్రాయం ఈ నానీల సంపుటిలో అడుగడుగునా కనబడుతుంది. కృత్రిమ అలంకారాల జోలికి పోకుండా, చిట్టి పొట్టి పదాలతో నానీల సౌందర్యం సామాన్య పాఠకుడికి కూడా అర్థమయ్యే రీతిలో రచించిన దేవేంద్ర అభినందనీయురాలు.

(నానీల మణిహారం, రచన:డా.ఎం.దేవేంద్ర,
యజ్ఞశ్రీ ప్రచురణలు,
హైదరాబాదు.
పుటల సంఖ్య 40,




– డాక్టర్ రాయారావు
సూర్యప్రకాశ్ రావు
9441046839



మంగళవారం త్యాగరాయ గానసభలో ఎంవీ సుబ్రహ్మణ్యం, మోహన్‌కృష్ణ, రావికొండలరావు, కృష్ణవేణి, రావిగోపికృష్ణ, బి. లక్ష్మి రామానుజం, చిదంబరం, భానుప్రకాష్, శివజ్యోతి ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ నవ్వులు పండించాయి. ఎంవీ సుబ్రహ్మణ్యం అధ్యక్షులు కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో సరదాగా నవ్వుకుందాం రండి– శీర్షికన ఈ కార్యక్రమం జరిగింది. సినీ నటుడు రావికొండలరావు ముఖ్య అతిథిగా హాజరై కళాకారులను అభినందించారు. ఎంవీ చేస్తున్న ఈ కళాసేవను ఆయన అభినందించారు.

నవంబరు 3న హైదరాబాద్ ఫిలింక్లబ్‌లో

## మల్లిక్ కు సినీ ప్రతిభా పురస్కారం



ప్రముఖకవి, గీతరచయిత మౌనశ్రీ మల్లిక్ ప్రతిష్టాత్మక సినీ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు సినీ రచయితల సంఘం రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రతిభావంతులైన రచయిలను సత్కరించాలని సంఘం నిర్ణయించింది. మల్లిక్ అనతి కాలంలోనే సినిమా, టెలివిజన్, ప్రైవేటు కలుపుకొని 550 పాటలను రచించినందుకుగాను ఈ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్టు సంఘం కార్యదర్శి ఆకెళ్ల, అధ్యక్షుడు పరుచూరి గోపాలకృష్ణ తెలిపారు. నవంబరు 3న హైదరాబాద్ ఫిలింక్లబ్‌లో జరిగే ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మెగాస్టార్ చిరంజీవి, ఆత్మీయ అతిథిగా నటుడు మోహన్ బాబు, విశిష్టఅతిథిగా దర్శకుడు కె. రాఘవేంద్రరావు హాజరుకానున్నట్టు సినీరచయితల సంఘం తెలిపింది.

## ఒక మానవతా సందేశం

# 'మనిషి కనబడుట లేదు'

" **ఏమిటీ మనిషి తత్వం!**
**ఎక్కడుంది మానవత్వం?"** ఈటె ల్లాంటి ఈ ప్రశ్నలు బ్రతుకునుండి బంధాలనుండి, అనుభవాలనుండి, అధ్యయనాలనుండి, సందర్భాలనుండి., సంఘటనల నుండి ఉత్పన్నమై ఒక రసార్ద్ర హృదయుణ్ణి పిండేస్తే ఒక్కుదుటగా పెల్లుబికిన అక్షరావేశమే ' **మనిషి కనబడుటలేదు** ' కవితా సంకలనం . మనిషన్న భావన మంటకలిసిపోతున్న నవీన సమాజంలో నిర్మల ఆనందం కనబడక ఒకకవి ఆశతో, ఆత్రంతో, తపనతో, అనుభవించిన వేదన తెలియాలంటే'మనిషి కనబడుటలేదు' చదవాలి. గుడిమెట్లు చెన్నయ్య గారిని అర్థం చేసుకోవాలి.

వ్యవస్థ తత్వాన్ని, గమనాన్ని పాఠకులచేత భావింపచేయడానికి, అనుభవాల్లోకి నడిపించడానికి కవికి ఒక ఆత్మగతమైన శక్తికావాలి. అభివ్యక్తీకరించగల సామర్థ్యంకావాలి. వ్యవస్థతో ఎదురాడగల ధైర్యం కావాలి. నిష్క్రియా తత్వంలో మగ్గిపోతున్న జనాన్ని జాగరూక పరచాలన్న తపన కావాలి. జ్వలించేవాడు, జ్వలించి బహిర్జగత్తుతో ఆత్మైక్యం పొందేవాడేకవి అంటారు విమర్శకాగ్రేసరులు గుంటూరు శేషేంద్ర శర్మ. జ్వలించే మానవతావేశం గుడిమెట్ల వారి కవిత్వంతోని ప్రతి అక్షరంలోనూ సాక్షాత్కరిస్తుంది. రోజు రోజుకీ తీవ్రస్థాయిలో పతనమౌతున్న మానవత్వం ' స్వీయ' కోరికలకోసం దిగజారుతున్న నైతికత, కొత్త పుంతలు తొక్కుతున్న విశృంఖలత్వం, అవమాన సంబంధాలు., అడుగడుగునా, అనుక్షణం కనుపిస్తున్న నేరాలు, ఘోరాలు, హింసలు, అరాచకత్వం.


**" రక్తపు మడుగులో**
**కొట్టు విట్టాడుతున్నవాడిని**
**చూసి చూడనట్లు వెళుతున్న"** వాడు
**" తాగినమైకంలో**
**కన్నుమిన్నుగానక**
**అడ్డంగా బిడ్డల నరికిన"** వాడు
**" జన్మనిచ్చిన**
**జననిపై కన్నుపడిన వాడు**

మనచుట్టూనే ఇలా పెచ్చరిల్లుతున్న వినాశకత్వం, తయారౌతున్న కర్కశహృదయులు, జ్ఞాన శూన్యులు, కామాంధులు చెన్నయ్య మనసును కలచివేసారు. **"వీడుమారేదెప్పుడు"** అంటూ ఆవేదనను, ఆవేశాన్ని అక్షరాల్లోకి ఒంపేలా కదిలించారు.

ప్రాథమిక స్థాయినుండి విద్యామూలాల్లో నైతికత లోపిస్తే కేవలం కాగితాల డిగ్రీలు, పనికిరాని పతకాలు, అలంకార ప్రాయాలయ్యే కప్పులు కనుపిస్తాయేగాని ధర్మం, సత్యనిష్ఠ, సేవానిరతి వంటి మనవైన సాంస్కృతిక పునాదులు కూకటివేళ్లతో సహా పతనమౌతాయనే విషయాన్ని " మనిషి కనబడుటలేదు" కవితా సంపుటిలో గుడిమెట్లవారు దృఢంగా చెప్పేప్రయత్నం చేసారు.

**"తెలివి తేటలకు తెగులు పట్టిందా"** అంటూ హూంకరించారుకూడా. బాధాతప్తులకు, ఆర్తులకు సాయం చెయ్యాల్సిన జనం "మానం నిలపాల్సిన మనం నవ్యపోకడలమోజులో చేస్తున్న భయంకరమైన తప్పుల్నికూడాచెన్నయ్య తన కవితల్లో ప్రస్తావించారు. చేతుల్లో చరవాణి పెట్టుకొని ప్రతి అంశాన్ని తన ఖాతాల్లో నిక్షిప్తం చేసుకుంటూ సామాజిక మాధ్యమాల ద్వారా మనం చేస్తున్న విలయాన్ని మనిషిలోని రాక్షసత్వాన్ని కవి తప్పుపట్టారు. వక్రగతిన నడుస్తున్న నవీన మీడియాను 'ఢీ'కొట్టడానికి గుడిమెట్లవారు ఎంతమాత్రమూ వెను కాడినట్లు తోచదు. హేయమైన క్షణాలను, ప్రమాదకరస్థితిలోని భారమైన క్షణాలనూసైతం చుట్టూచేరి వినోదంగా వీడియోలు తీసే నవమానవ దౌర్బల్యం.......

**" వివస్త్రయై, విగతజీవిగా పడివున్న**
**మానవతుల శరీర భాగాలపై కూడా**
**మరీమరీ చూపే అమానవీయ దృశ్యాలు**
**........**
**నేను చవిచూస్తున్నా నేడు**
**మరినా బిడ్డకేమౌతుందో రేపు"** అంటూన్న కవిమాటలు యధార్థ సామాజిక గతిని అద్దంలో చూపుతూ మానసిక పరివర్తనకోసం చైతన్యం రగిల్చే అస్త్రాలుగా కనుపిస్తాయి.




**" ఇందులో చెట్లను గురించో పూలను గురించో, మేఘాలను, నదులను గురించో వర్ణనలు ఉండవు. నగటు మనిషివడే ఆవేదన, సమాజంలోని దమనకాండలు, అలజడులు, అల్లర్లు, మానభంగాలు, దోపిడీలు, మానవత్వంలేని మనుషుల వికృతపు చేష్టలు నా కవితా వస్తువులు"** అని ఒక సంస్కర్తగా సాంస్కృతిక పరిరక్షకునిగా చెన్నయ్య తనకు తాను నియమాలు విధించుకున్నారు. **"హితేన సహితం సాహిత్యం"** అనే ఆరోక్తికి తానొక ప్రతీకగా నిలిచారు.

బాధితుల జీవితాల్లోకి పరకాయ ప్రవేశం చేయగలిగితేనే బాధల లోతులు అర్థమౌతాయి. వేదనల మూలుగుకు, సానుభూతి మాటలకు చాలా అంతరం ఉంటుంది. సమాజసేవ, సాహిత్యసేవలకోసం ఆర్తులకోసం, అక్షరాలకోసం పరితపిస్తూ తిరిగే గుడిమెట్లవారు ప్రతి అంశాన్ని అధ్యయనం చేస్తారు. పేదల్లో పేదవానిగా, బాధితుల్లో తానొకనిగా పరకాయ ప్రవేశం చేస్తారు. వేడెక్కిన గుండెతో, పదునెక్కిన అక్షరాలతో మెరుగైన రేపటిని ఆశ్వాసిస్తూ కవితావేశం దించుకుంటారు. అవసరమైన సందర్భాల్లో కవితావాడి పెంచుతారు.అమాయకంగా అతివలు బలౌతున్నప్పుడు, మదోన్మత్తులరాక్షసత్వం ప్రజ్వలిల్లుతున్నప్పుడు, కామదాహం కట్టలు తెంచుకుంటున్నప్పుడు తప్పని సరిగా అతివలు తమ అతీతశక్తిని వినియోగించాలని., మాతృత్వసున్నితత్వాన్ని విడనాడి మహంకాళిగ అవతరించాలని ప్రబోధించారు.

**" దయా దాక్షిణ్యాలంటూ దమయంతులు కావద్దు**
**సహనం సౌశీల్య మంటు సీతమ్మలు కావద్దు"**
అంటూనే
**" అతివా! ఆలోచించు**
**అన్యాయమని అనిపిస్తే**
**అడ్డంగా నరికెయ్"** అని ఘూటైన సూచనలు చేస్తారు. అంతమాత్రాన కవి హింసావాదాన్ని సమర్థించినట్లు భావించలేం. మహిళలు కాలాను గుణంగా మారాలని చెప్పేందుకే దమయంతి, సీతల ప్రస్తావన తెచ్చిన గుడిమెట్లవారు " అవసరమనిపిస్తే " అంటూన్న సందర్భంలో స్త్రీలు తమదైన మెతకవైఖరికి కట్టుబడరాదని., అసమాన పరాక్రమాన్ని నిద్రాణస్థితి నుండి మేల్కొలపా లని ప్రబోధ చేసారు. ఒక విచక్షణతోకూడిన కవిత్వం రాస్తూ చెన్నపురిలో తెలుగు సాహితీ వ్యవసాయం చేస్తున్న గుడిమెట్ల చెన్నయ్య సిసలైన మాతృభాషాభిమాని. అలుపెరగని సంఘసేవకులు. పడికట్టు పదాలతో ఆటవిడుపు కవిత్వం రాయడం వీరికి నచ్చదు. తెలుగుభాషపై మమకారం తో నేల నాలుగు చెరగులకు పరుగులు తీసేవీరు ఆదర్శాల ప్రబోధాలకంటే వాటి ఆచరణకే ప్రాధాన్యతనిస్తారు. **"స్వశక్తితో సంపాదించిన చప్పిడి మెతుకులే మిన్న"** గా భావిస్తారు. కుట్రలు, కుతంత్రాలు., అలజడులు, అల్లర్లులేని రోజులు, దోపిడులు దౌర్జన్యాలు సమసి సమభావం వెల్లివిరిసే సమాజం, శాంతి సౌఖ్యాలు వికసించే సరిక్రొత్త మార్పు రావాలని ఆకాంక్షిస్తారు. " మనిషికనబడుటలేదు" కవన సంపుటి వీరి హృదయ ఘోషకు చక్కని ప్రతిబింబం.

**ప్రతులకు:**
రచయిత
గుడిమెట్ల చెన్నయ్య
సెల్: 9790783377



**డా॥ కప్పగంతుల మధుసూదన్**
చరవాణి : 9246468076


---

పుస్తక సమీక్షలు

# మంచి విశ్లేషకుడు నారాయణమూర్తి

**"కావ్యమునందు సమకాలీన భావములను, సంప్రదాయములను దర్పణము నందువలె ప్రతిఫలించుననుట అనుభవ పునరుక్తము, కవి యెంత జాగరూకత వహించినను, వస్తువెంత పురాతనమయినను ఆతని కవితలో సమకాలీన భావములును, ఆచారములును ఎట్లో చోటు చేసుకొనును. తన కాలము నధిగమించి ఏ కవియు మనజాలడనుట కాదనరాని సత్యము"** అని సుప్రసిద్ధ సాంప్రదాయ సాహిత్య విమర్శకులు తిమ్మా వజ్ఝల కోదండరామయ్యగారు తన గ్రంథం **"కవి రాజశిఖామణి"**లో **"సాహిత్యం-సమకాలీనత"** మీద ప్రకటించిన అభిప్రాయం. ఈ సిద్ధాంతపు వెలుగులో నుంచి అనుశీలించి చూస్తే- ఏనాటి సాహిత్యంలోనైనా- ఆనాటి రాజకీయార్థిక, సామాజిక, చారిత్రక స్థితిగతులు ప్రతిబింబిస్తూ వుంటాయి. (తిమ్మావజ్ఝల వారు చెప్పిన-'' తన కాలమునధిగమించి ఏ కవియు మనజాలడు' అన్న విషయంలో- తెలుగు సాహిత్యానికి సంబంధించి- గురజాడ ఎప్పుడూ ఒక మినహాయింపు). చరిత్రను మాత్రమే వేరు చేసి చూస్తే రాజ్యాలూ-అధిపతులూ-యుద్ధాలూ-కట్టడాలూ- అన్నీ శాసనాల ఆధారంతో సాహిత్యానికెక్కుతాయి. కట్టడాల కింద చరిత్ర ఆలయాలను- పుణ్యక్షేత్రాలను-తీర్థాలను సమాజానికి అందించింది. భారత దేశంలో వెలసిన అతి గొప్ప నాగరికతకూ- కళా హృదయానికీ చిహ్నాలుగా దేశం నలుమూలల్లోనూ ఎన్నో క్షేత్రాలు-ఆలయాలు ఈ నాటికీ నిలిచి వున్నాయి. దేశంలోని ఇతర ప్రాంతాల్లోలాగే- తెలుగు ప్రాంతంలో కూడా అనేక పుణ్యక్షేత్రాలు పురుడుపోసుకున్నాయి. ఒక క్షేత్రానికి సంబంధించి చరిత్ర-ఆ చరిత్రను ముందుతరాల లోగిళ్లకు తీసికెళ్తూ సాహిత్యం-ఇవి రెండూ అవినాభావ సంబంధాన్ని కల్గి ఉంటాయి. స్థూలంగా- ఏ చరిత్రకైనా ఆధారాలు సాహిత్య ప్రపంచంలోనే దొరుకుతాయి. అయితే చరిత్రను తవ్వుతున్న సందర్భంలో ఆ చరిత్ర యిచ్చిన వారసత్వం-ఫ్యూడల్ భావజాలానికి సంబంధించినదా, 'బూర్జువా ప్రజాస్వామానికి సంబంధించినదా- అన్న వాదాలు అనివార్యంగా బయలుదేరుతాయి. కాని అవి ఈ సందర్భానికి మాత్రం తగినవి కావు. తెలుగునేల మీద వెలసిన క్షేత్రాలు- వాటిని అల్లుకొని సృష్టించబడిన సాహిత్యం మీద- పరిశోధనా దృక్పథంతో- అభ్యుదయశీలి- మాడుగుల నారాయణమూర్తి రాసిన పుస్తకం **'తెలుగులో క్షేత్రాలు-సాహిత్యం"**. నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణగా వచ్చిన ఈ గ్రంథంలో "కాళేశ్వరం", "ద్రాక్షారామం", "శ్రీశైలం", "వేములవాడ", "శ్రీ కాళహస్తి" మొదలైన శైవక్షేత్రాలతో బాటు- బాసర- జ్ఞాన సరస్వతీక్షేత్రం-ధర్మపురి-శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రాల్లో సంబంధించిన చరిత్ర-సాహిత్యాల మీద విశ్లేషణ ఉన్నది. ఇందులో నారాయణమూర్తిగారు చేసిన మంచి పని ఏమిటంటే- ఆయా క్షేత్రాల చరిత్రలను- కథలను కూలంకషంగా అధ్యయనం చేసి- ప్రధానంగా జనప్రచారంలో వున్న చరిత్రను (కథలను)పురాణాల్లో (ముఖ్యంగా స్కాంద పురాణం) ఆధారాలను నిరూపించే ప్రయత్నం చేస్తూ- వివరించటం ఇలా ఒక హేతుబద్ధతను సంతరించుకోవటం వల్ల చరిత్రకారుల మీద- చరిత్ర మీద సహజంగానే తలెత్తే వివాదాలకు- అపోహలకు కొంత అవకాశం తక్కువగా వుంటుంది. ఈ విషయంలో మూర్తిగారి వ్యూహం ఫలించిందనే చెప్పాలి. ఈ క్రమంలోనే **"తెలుగు సాహిత్యము-భక్తి, ఇవి రెండూ అవినాభావ సంబంధాన్ని కల్గి వున్నాయి"** అంటారు మూర్తి. భావ కవిత్వం కళ్లు తెరిచే దాకా- తెలుగు సాహిత్యమంటే- కేవలం భక్తి సాహిత్యంగానే (భావ కవిత్వంలోనూ భక్తికి శాఖలున్నాయి. కాని పాత వాసనల్లేవు) నడిచింది. ఆ భక్తి సాహిత్యం సమాజం మీద ఎలాంటి ప్రభావాన్ని ప్రసరించిందన్న సంగతి ఇక్కడ అప్రస్తుతమైనప్పటికీ మూర్తిగారి పరిశీలన మాత్రం వాస్తవమే. ఆవాస్తవానికి నేటికాలం ఒక మినహాయింపు. అయితే భక్తి- క్షేత్రం కూడా అవినాభావ సంబంధాన్ని కల్గి వున్నవే. క్షేత్రాల చుట్టూ అల్లుకున్న సాహిత్య మంతా ప్రధానంగా భక్తి సాహిత్యం. ఆయా క్షేత్రాల మహత్యాలను కొనియాడటం-ఆ క్రమంలో పురాణాంతర్గత కథలను సాహిత్యంలో ప్రవేశపెట్టటం- వీలైతే కల్పనాశక్తికి పనిపెట్టి మరీ దైవశక్తిని నిరూపించటం- ఇదీ- స్థూలంగా క్షేత్ర సాహిత్యం చేసేపని- చేసిన పని. మాడుగుల నారాయణమూర్తిగారి విశ్లేషణ (విమర్శ అనలేం!) కూడా ఆ సాహిత్యానికి విధేయంగా, ఆ విలువలకూ- విశ్వాసాలకే అనుగుణంగా నడిచింది. దైవం మీద- భక్తి సాహిత్యమ్మీద మూర్తిగారి సానుకూల దృక్పథాన్ని ఇందులో గమనించవచ్చు. పచ్చి గ్రాంథిక భాషావాదిగా ముద్ర వేయించుకున్న జయంతి రామయ్య పంతులుగారు "రాగద్వేషములు లేక సమబుద్ధితో గ్రంథమందలి గుణ దోషములను ఉన్నవి ఉన్నట్లు తెలుపుట సహృదయుడగు విమర్శకుని పని" (పుట:123) అని తన "ఆధునికాంధ్ర వాఙ్మయ వికాస వైఖరి" అన్న గ్రంథంలో చెప్పి ఉన్నారు. ఇది విమర్శక స్థానంలో నిలబడ్డ వాళ్లందరికీ వర్తించే సూత్రం. ఈ విషయంగా చూస్తే నారాయణమూర్తిగారు "సహృదయుడగు విమర్శకుని"కంటే 'సహృదయుడుగు విశ్లేషకునిగానే- ఎక్కువ కష్టపడ్డారు. వీరి కృషిని వివరణాత్మక విమర్శ లేదా వర్ణనాత్మక విమర్శ అని అనవచ్చును.చాలా మంది కవులకు- విమర్శకులకు ఉన్న విధంగానే నారాయణమూర్తిగారికీ ఒక బలహీనత (బహుశా! బలం కూడానేమో?) వుంది. పుస్తకంలో మిగతా క్షేత్రాలతో పోలిస్తే- కాళేశ్వరం-దానిపై వచ్చిన సాహిత్యం మీద జరిగిన విశ్లేషణ-చాలా పెద్దదిగా తయారయ్యింది. అన్నింటి మీదా ఇంత విస్తృతంగా విశ్లేషణ జరిగి వుంటే మంచి మేలు జరిగేది. "కాళేశ్వరం" మిగతా క్షేత్రాలకు మధ్య అంతరం స్పష్టంగా కనిపిస్తుంది. ఇదే ఆ లోపం. బలహీనత ఎక్కడున్నదంటే- నారాయణమూర్తిగారికి కాళేశ్వరం పుట్టిన గడ్డ కావటం వల్ల కలిగిన ప్రేమతో-మిగిలిన క్షేత్రాల కంటే- కాళేశ్వరం క్షేత్రం గురించి ఎక్కువ చేసి రాయటంలో వుంది. దీనికి కారణాలు కూడా లేకపోలేదు. కాళేశ్వరం మీద వచ్చిన సాహిత్యం అందుబాటులో ఉండటం- అంతకు ముందే మూర్తిగారు రెండు గ్రంథాలు ఈ నేపథ్యంలోనే రాసి ఉండటం వల్ల- కలిగిన సౌకర్యాల వల్ల ఈ క్షేత్రం మీద వ్యాసం అనివార్యంగా పెద్దగా తయారయ్యింది. మిగతా క్షేత్రాలపై వచ్చిన సాహిత్య లభ్యత- ప్రభుత్వం పుస్తకం రాయడానికి ఇచ్చిన అతి తక్కువ కాల పరిమితి- ఇవి రెండూ ఈ విషయంలో రచయితకు ఇబ్బంది పెట్టిన అంశాలు. దీన్ని మినహాయిస్తే- నారాయణ మూర్తిగారు క్షేత్రాలను పరిచయం చేసే విధానమైనా- ఆ క్షేత్రాల నేపథ్యంలో సృష్టించబడిన సాహిత్యాన్ని పరిచయం చేసే విధానమైనా- ఆకట్టుకుంటుంది.

క్షేత్రాలను పరిచయం చేసే క్రమంలో- ఆ క్షేత్రాల పరిధిలోగల ఇతర ఆలయాల వివరాలు తెలపటం- తీర్థాలను, వాటి పూర్వ కథలను పొందు పరచటం- వల్ల ఆయా క్షేత్రాల సమగ్ర స్వరూపాన్ని కళ్లకు కట్టించే ప్రయత్నం చేశారు రచయిత. క్షేత్ర సాహిత్యాన్ని విశ్లేషిస్తున్న సందర్భంలో- ఆ సాహిత్యంలోని శైలీ- శిల్పాలను విశ్లేషిస్తూనే- అందులోని ఉదాత్తమైన అంశాలను విశ్లేషించే క్రమంలో నారాయణమూర్తి గారి ప్రతిభ బయటపడుతుంది. కవులలోని ఉక్తి చమత్కారాలను- అలంకార ప్రయత్నాన్ని వర్ణనా చాతుర్యాన్ని- అచ్చ తెలుగు పదాల గుభాళింపులను పట్టుకొని వ్యాఖ్యానించిన విధానం- పాఠకులను శ్రద్ధగా చదివింపజేస్తుంది. నిజానికి నారాయణమూర్తిగారి ప్రతిభ అంతా సాహిత్యాన్ని విశ్లేషించడంలోనే కేంద్రీకృతమై వుంది. కాళేశ్వరం క్షేత్ర నేపథ్యంలో ముదిగొండ వీరభద్రమూర్తిగారు రచించిన "కాళేశ్వరంఖండం" కావ్యాన్ని అధ్యయనం చేసి మాడుగుల వారు **''ఈ కావ్యంలోని ఐదు ఆశ్వాసాల పరిశీలించినట్లయితే సందర్భానుసారంగా సామెతలు, అలంకారాలతో భక్తి ప్రవత్తులతో పాఠకులకు ఆకర్షణీయంగా కావ్యాన్ని తీర్చిదిద్దారు"** అని అనటం ఆ కావ్య సారాన్ని తెలియజేస్తుంది. ఇంకా కొన్ని కొన్ని సందర్భాలలో కవులలో తొంగి చూసిన అభ్యుదయ దృక్పథాన్ని పట్టుకొని- తన దృక్పథంతో జోడించి చేసిన వ్యాఖ్యలు నారాయణమూర్తిలోని ప్రగతి శీలతకు ఉదాహరణగా నిలుస్తాయి. చూడండి- వీరభద్రమూర్తిగారి "కాళేశ్వరం ఖండం" కావ్యాన్ని విశ్లేషిస్తున్న సందర్భంలో- ఒక చోట **"కులాల ప్రసక్తి మూలంలో ఉన్నప్పటికీ ప్రస్తుత కాలానికి అనుగుణంగా కులాల ప్రసక్తి రాకుండా చూపే ప్రయత్నం చేశారు"** అని అంటారు నారాయణమూర్తిగారు. కావ్యాలలో "ముఖము చెల్లక", "దులుపుట" లాంటి తెలుగు నుడికారాలను పట్టుకునే ప్రయత్నమూ మూర్తిగారి ప్రత్యేకతను నిలబెట్టుకుంది. మొత్తానికి క్షేత్రాల మీద కుతూహలం-భక్తి సాహిత్యం మీద ప్రేమ-వున్న వాళ్లందరూ తప్పకుండా చదువవలసిన పుస్తకం **"తెలుగులో క్షేత్రాలు-సాహిత్యం"**, "భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పట్ల ఎనలేని గౌరవంతో మన సంస్కృతి పరిరక్షణ కోసం నా రచనా వ్యాసంగం ప్రారంభించాను" అని నారాయణమూర్తిగారు "ప్రవేశిక"లో చెప్పుకున్నారు. ఈ రచనను ఇదే కోణంలో చూడాలి.




ప్రతులకు: తెలుగు అకాడమీ
హిమాయత్‌నగర్
హైదరాబాద్

**- తోకల రాజేశం**
సెల్: 9676761415



---

## అండగా ఉంటాము

అరకపట్టిన వాడు
మెరక దున్నినవాడు
ఉరికెందు కురుకుతున్నాడు?

కరువులు, వరదలు
కవలలై కదిలొచ్చి
కసిదీర రైతును
కాటు వేస్తున్నాయి

విత్తులు, మందులు
కల్తీలు జేసేటి
కక్కుర్తి నాయాళ్ళు
రైతు కుత్తుకను కోయుచున్నారు.

పెద్ద గెద్దల వోలె
మధ్యవర్తులు వచ్చి
కల్లానపంటను
కొల్ల గొదుతుంటేను
తెల్లబోయిన రైతు
కళ్ళు తేలేస్తున్నాడు

ఎరువుల-కరువుల
యంత్రాలసబ్సిడీ
సర్కారు నౌకర్లు
చల్లగా నొక్కేస్తే
సాయమందక రైతు
చావుకు తెగబడియె

వ్యవసాయ మన్నది
వృత్తియని మరిచారు
ఉద్యోగితో పోల్చి
గంటల పనిజేసే
ఆధునిక రైతులు
అడుగడుగునున్నారు.

సాంప్రదాయ సేద్య
పద్ధతులు విడనాడి
పరాన్నజీవులై పరులసాయం కొరకు
అర్రులు చాస్తున్న రైతన్నతీరు.

మట్టి మనిషి యొక్క
పొట్టగొట్టిన వాని
పనిబట్టె చట్టాలు
పదునుగా జేయాలి.

అరకపట్టిన వాని
ఆర్థిక స్థితిగతులు
మెరుగుపరిచిన నాడే
మురిగిపోయిన రైతు
తిరిగి పై కొస్తాడు.

మెరకదున్నిన వాడు
దొరకునా యిటువంటి
దొడ్డసేవంటూ
వృత్తి కాపున రంకితం అయితే

అన్నదాత సుఖీభవ అవుతారు
అందరం అతనికి అండగా ఉందాం.

**- చింత రమణ**
9701652766

---


## నా మనసు బాపూజీ దుఃఖం

బాపూజీ నడిచిన నేల
రక్త సిక్తమయిన తర్వాత
బాపూజీ జిందాబాద్ అనటం
రాజకీయ అనివార్యం కావచ్చు.
ప్రజల భవిష్యత్తు పదిలానికి
నిదర్శనం కాదు
శాంతి ఎక్కడుంది?
ఇప్పుడు పెద్ద ప్రశ్న
మనసులోనా
మనిషిలోనా
సంఘంలోనా?
ఎవరి గుండెల్లో శాంతి వుందో చెప్పండి.
బాపూజీకి పూలమాలలు
రాజకీయ రంకుకు నిదర్శనం తప్పవేరుకాదు.
సత్యం ఎక్కడుండాలో అక్కడ కూడా లేదు
ఇపుడు
సత్యం- ఒక బలహీనత నిదర్శనం
బాపూజీ జిందాబాద్ అనటం
అధికార పోటీలో అదొక విషాదం.

**-సి.హెచ్. మధు**
9949486122



---



## అనుభవాలు పాఠాలు-1

# తెలిసేట్లు ఎలా చెప్పాలి

*ప్రతి వ్యక్తీ, ఈ అనంత జన ప్రవాహంలో 'సమూహంలో ఒకడు'గా జీవిస్తున్నవాడే!*

*ప్రతివ్యక్తీ, రోజూ ఏవేవో కొత్త అనుభవాల్ని ప్రోవు చేసుకుంటున్నవాడే!*

*ప్రతివ్యక్తీ, బ్రతుకుబడిలో పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థే!*

*ఆ వ్యక్తిని ఆవరించుకుని తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, సహాధ్యాయిలు, ఉపాధ్యాయులు, ఉద్యోగంలో చేరాక పై అధికారి, సహ ఉద్యోగి, సబార్డినేటులు, ఆ సంస్థతో లావాదేవీలు నడిపే వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు, ఇంటిచుట్టూ ఉన్న ఇరుగు పొరుగూ, రోజూ 'వాకింగ్'లో కనబడే పరిచయస్తులు ఇలా వీళ్ళందరితోనూ అనుభవాల్ని ప్రోవుకుంటున్నాడు.*

*ప్రతీ అనుభవం- తనది కావచ్చు లేదా ప్రక్కవారిది కావొచ్చు- లోంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగటంలోనే విజ్ఞత ఉంది. ఏడున్నర దశకాల కూర చిదబంరం జీవితంలో ఎదురైన అనుభవాలు, వాటిలోంచి నేర్చుకోగలిగే పాఠాలే ఈ "అనుభవాలు-పాఠాలు"-!*

- సంపాదకులు

కమ్యూనికేషన్ అన్న ప్రక్రియలో మనకు ఎంత తెలిసింది. మనం ఎంత గొప్పవారం అన్నది ముఖ్యం కాదు. ఎదుటివారికి తెలిసేటట్లుగా, వారికి అర్థం అయ్యేటట్లుగా చెప్పగలిగామా లేదా అన్నది ముఖ్యం.

ఆ కంపెనీలో నేను క్రొత్తగా చేరిన రోజులు. ఆ కంపెనీ కూడా అప్పుడే మొదలయ్యింది. నేను మరియు సంస్థ ఎం.డి. 'డెస్సిగేటు' అయిన నా బాసు - ఆ కంపెనీలో, ఇద్దరమే ఉద్యోగులం. 'డెసిగ్నేటు' అన్న పదం ఎందుకు వాడానంటే ఆయన ఎం.డి. అన్న భేషజం కాని నేను ఎక్కవుంటెంట్ 'ఎక్కౌంట్ ఆఫీసర్'ను అన్న భేషజం కాని మా ఇద్దరికీ ఉండకపోయేది. మేమే బాసులం మేమే అటెండర్‌లం, ఒకరికి ఒకరు అసిస్టెంట్‌లం.

1970వ దశకంలో సిమెంట్, ఇనుప సలాకలు (ఇనుము) రెండూ కంట్రోలు వస్తువులే. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి బాధ్యులైన డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ అనే ప్రభుత్వ విభాగం స్టీలు అలాట్ చేసేది. పరిశ్రమల వారు నేరుగా హిందుస్థాన్ స్టీల్ వారి గోడౌన్‌లోంచి తెచ్చుకోవాలి. బయట ఇబ్బడిముబ్బడి ధరలు. పైపెచ్చు నాణ్యత గ్యారంటీ ఉండేదికాదు. అందుకని కీలకమైన నిర్మాణాలకు తయారు చేస్తున్న కంపెనీల నుండి డైరెక్టుగా కొనటం తప్పనిసరి.

హిందుస్థాన్ స్టీలు వారి గోడౌన్ నాచారంలో ఉంటుంది. నిర్మించాల్సిన మా ఫ్యాక్టరీ ఉప్పల్‌లో ఉంది. డెలివరీ తీసుకున్న ఇనుమును లారీ ద్వారా ఉప్పల్ చేర్చాలి. అమ్మకము ఫార్మాలిటీస్ అయిపోయాయి. ఇనుము తూకం వేసి నాకు అప్పగించారు. రవాణా చేయటానికి ఒప్పుకున్న లారీ డ్రైవర్‌కు మా ఫ్యాక్టరీకి ఎలా వెళ్ళాలో వివరిస్తున్నాను.

"ఇదుగో ఇక్కడినుండి ఆర్.ఆర్.లాబ్స్ వెళ్ళాలి. ఆ క్రాసు రోడ్‌లో ఎడంవైపు తిరగాలి. అక్కడ ఎన్.జి.ఆర్.ఐ. అనే సంస్థ వస్తుంది. ఆ సంస్థ చివరి గేటు ఎదురుగా వెళ్ళి మాడర్న్ బ్రెడ్ ఫ్యాక్టరీ దగ్గర కుడివైపు తిరిగి" అంటూ చెప్పబోతున్నాను. ఆ డ్రైవర్‌కు ఇవేమీ అర్థమైనట్లులేదు. 'ఎన్.జి.ఆర్.ఐ. అంటే ఏమిటి? మాడర్న్ బ్రెడ్ అంటే ఏమిటి?' అన్నట్లుగా ముఖం పెట్టాడు.

డ్రైవర్‌కు అర్థం అయ్యేట్లుగా ఎలా చెప్పాలో తెలియని పరిస్థితి. హతాశుడనయ్యాను. డ్రైవరు కూడా నేను మాట్లాడే భాష, పదాల్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు కానీ చేసుకోలేకపోతున్నట్లు ఆయన ముఖమే చెబుతోంది. ఏం చేయాలో, ఎలా చెప్పాలో పాలుపోక దిక్కులు చూస్తున్నాను. మా ఇద్దరి అవస్థనంతా గోడౌన్ వాచ్‌మెన్ గమనిస్తున్నాడు.


నెమ్మదిగా నా దగ్గరికి వచ్చి "ఎక్కడికి వెళ్ళాలి సార్" అని అడిగాడు. వివరాలు చెప్పాను. అతను డ్రైవర్‌ని సమీపించాడు. ఇలా చెప్పాడు. "ఉప్పల్ దోవలో ఒంటికొమ్ము మసీదు ఉంది కదా" అన్నాడు. "అవునన్నాడు" డ్రైవర్. "ఒంటికొమ్ము మసీదు వైపు తిరుగు. ఆ తరువాత డబల్ రొట్టెల కార్ఖానా తెలుసా?" అని అడిగాడు. డ్రైవర్ "తెలుసు" అన్నాడు. "అక్కడ వెళ్ళి ఆగు ఈ సారు వచ్చి వాళ్ళ కార్ఖానాకు తీసుకెళ్తారు" అన్నాడు.

డ్రైవర్ ముఖంలో చెప్పలేనంత రిలీఫ్.

ఎక్కడికి వెళ్ళాలో తెలిసిపోయిందాయనకు. "గిట్ల ఖుల్ల ఖుల్ల జెప్పకుండా ఏవో కొత్త జాగల పేర్లు చెప్పి పరేషాన్ చేస్తవేందయ్యా! నువ్వు నడు. నేను డబల్ రొట్టెల కార్ఖానా దగ్గర నిలుచుంట" అన్నాడు.

ఆ తరువాత ఆ డ్రైవర్ ఏ ఇబ్బందీ లేకుండా మా ఫ్యాక్టరీ చేరి ఇనుమును దింపగలిగాడు.

''ఏదైనా ఓ విషయము ఎదుటివారికి చెప్పాల నుకున్నప్పుడు ఎదుటివారి స్థాయికి మనం దిగితే తప్ప వాళ్ళు అర్థం చేసుకోరు." అన్న విషయం మొదట మనం అర్థం చేసుకోవాలి.



**-కూర చిదంబరం**
సెల్: 8639338675

---

## పరాన్న జీవుడు

వరములీయడు స్వామి
గొర్రెతోక బెత్తెడే - జీవితము
ముప్పొద్దులా ఒక్కప్పొద్దులు
లోన వినిపించే ఆకలి కేకలు
చెవులకు గెళ్ళుబడ్డట్లు
కళ్ళు బైర్లు గమ్మినట్లు
ఆవేశములోను నీరసమే!
ఓంట్లో ఒణుకు
మాటల్లో తడబాటు
పుర్రెలో ఆలోచనా
సునామీలు ఎగసినా...
అడుగంటినట్లు
మెతుకుపైనే ద్యాస

సమర్థతకు కొదవలేదు
చొరవకు సందులేదు
సాయానికి చేయి రాదు
పెరిగింది వయస్సో!
తరిగింది కాలమో తెలీదు
కట్టుకున్న గూడు చెదిరి
పెంచుకున్న గొడ్డు ఒట్టిపోయి
కన్నబిడ్డలు వలసపోయి
అంతా ఊహించిందే
ఉసూరుమంది ప్రాణం
ఏవయస్సుకా వయస్సు
మనిషికి మనిషి అండ లేకుంటే మనలేదు
కొన్నిమొక్కలకు మల్లే బ్రతుకుతాడు
అంటారంతా 'పరాన్న జీవుడు'
ఎంతో తెలివిగా జీవించానను కున్నా
మనిషి జీవితానికి ముగింపు
కొత్తగ రాద్దామనుకున్నా తెలీక
కానీ, గుడిలో దాగిన సామి
ఆశామోహాలు, కష్టాలు, త్యాగాలు
మన నుదిటిన ముందే రాసాడని..!!



**- ఆత్మకూరు రామకృష్ణ**
91 9493 40 5152

---

## గమ్యాన్ని చేరాలి

పల్లవి: ఎందుకురా- నీకింత గుబులు
లేని చింతకేల-ఈ దిగులు
అర్థంకాని- నీ ఆలోచనలు
నిన్నుతరిమే- అవరోధాలు
అడుగు ముందుకేసి కదలాలి
నిలవాలి- నీ చెంత విజయాలు.

చరణం: నీకే తెలియనిదేదో- ఓ లేనితనం
దాగున్నది నీలో- ఓ చీకటి రణం
అది తెచ్చెను- నీలో కుమిలిపోయేతనం
చివరికదే- మ్రోగే ఓ మరణ మృదంగం

అన్నీ పక్కకు నెట్టేసి-నిరాశపని పట్టేసి
వేకువని తలుచుకొని-ఆవలితీరంచేరాలి

ఆగిపోకు-మున్ముందుకు- సాగిపో సోదరా!
వెనక్కి తగ్గకు- గమ్యం చేరుకో- మిత్రమా!

గతాన్ని తలచి- నీ విజ్ఞతనొదిలి
నీ మనసును విరిచి- మనిషివని మరిచి
ఏలనీవు వగచేవు- నీ తనువును వీడేవు

ఆలోచన చేస్తే- అగాథాన్ని దాటలేవా!
చిమ్మచీకట్లో -మిణుగురువై ఎగరలేవా!

నీ తెలివి తేటల పదును చూపాలి
నీ బ్రతుకున- పండు వెన్నెల పుయ్యాలి

ఆగిపోకు-మున్ముందుకు- సాగిపో సోదరా!
వెనక్కి తగ్గకు- గమ్యం చేరుకో- మిత్రమా!

కష్టమైనా రానీ- నష్టమైనా జరగనీ
బాధలెన్నొచ్చినా-బాధ్యత లెన్నున్నా
ఏది ఎలాగున్నా-ఏటికి ఎదురీదాలి
నీవనుకున్నది- సాధించాలి
నీ కలలు-సాకారమవ్వాలి
నీ జీవితం- నిండుపున్నమవ్వాలి

ఆగిపోకు-మున్ముందుకు-సాగిపో సోదరా!
వెనక్కి తగ్గకు- గమ్యం చేరుకో-మిత్రమా!



**- బి. గోవర్ధనరావు**
9441968930

## ఛాలెంజ్


వుక్కిరి బిక్కిరి ఆలోచనల్ని
ముక్కుమూసి తరిమేద్దాం!
మతం వేస్కున్న కొవ్వును
హఠం వేసి కరిగిద్దాం!
జంకు గొంకుల నడకను
మంకుపట్టుతో సాగిద్దాం!
ఇబ్బడి ముబ్బడి రోగాల్ని
ఒబ్బిడిగా మట్టికరిపిద్దాం!
బిజీ బిజీ బ్రతుకును
సజావుగా మార్చుదాం!
ఆబగా ఎదిగే ఊబకాయాన్ని
ఆపే శక్తిని పొందుదాం!
నియంత్రణ మరిచిన అలవాట్లను
సవాలు విసిరి సరి చేద్దాం!
యోగధ్యానాలు వొంటికినేర్పి
ఆరోగ్యాన్ని సాదిద్దాం!



దేగల అనితాసూరి
9247500819

## నల్లధనం

చీకటి సామ్రాజానికి మేమే రాజులం
మమ్మల్ని ఎవరూ ఏమీచేయలేరు
ఎవరు చేరనంత దూరంలో ఉన్నాము
చేరినా అందనంత ఎత్తులో ఉన్నాము
సామాన్యున్ని రాబందుల్లా పీక్కుతిని, పిప్పిచేసి
బొర్రలు నింపుకొని బడాబాబుల కబంధహస్తాల్లో
చిక్కుకున్నాం.
అన్యాయం, అక్రమం, మోసం, దగా
కుట్ర, దోపిడి, దొంగతనం
ఈ పోటీ పరీక్షల్లో ఎవరికి ఎక్కువ
మార్కులు వస్తాయో
వారిదగ్గర నిక్షేపంగా రక్షణుంటది.
న్యాయంగా,నీతిగా, నిజాయితీగా
ఉండే వారి చేతుల్లో ఉండలేం
వారు మమ్ములను చీత్కరిస్తారు
ఎవరు ఏమైపోతే మాకేంటి
కాటికెళ్తే మాకేంది.
మేము కోరలు దాచుకొని విషము
గ్రక్కుతూనే ఉంటాం.
న్యాయ దేవతకు మమ్ములను
చూస్తే భయం
అందుకే కళ్లకు గంతలు
కట్టుకుంటుంది.
కాళీయుని గర్వమణచి
పడగల మీద నాట్యం చేస్తూ పారిపోయేలా చేసిన
బాలకృష్ణుని లాంటివారు
చీకటి సామ్రాజ్యాన్ని
కూకటివేళ్లతో పెకిలించడానికి
ఎప్పుడు వస్తాడో!
మాకు విముక్తి లభించేదన్నటికో
వేచి చూడాల్సిందే!!
నల్ల ధనమంతా తెల్లదైపోయి
అందరి బతుకుల్లో వెలుగు
చూడాలని మా ఆశ.



– వరికోలు లక్ష్మయ్య
సెల్: 9704865816

## జారుడు మెట్టు

కష్టాల కౌగిట్లో మగ్గితేనేగా
సుఖాల హృదయంలో చోటుదక్కేది
సుడిగుండాలను చుట్టొస్తేనే కదా
దుఃఖందరిచేరదు.
కష్టాల్లో కన్నీళ్ళను తాగితేనేకదా
దుఃఖంలో దూర తీరాలకు
ప్రయాణం చేయవచ్చు.
వడ్డించే వారు మనవాడైతే
ఆఖరికి పోయిన అన్నీ దొరుకుతాయి
ప్రతి తల్లితండ్రి తమ బిడ్డలపై
ప్రేమతో ఏకష్టం కలుగకుండా
అన్నీ పోగేస్తున్నారు
పుట్టంగానే బంగారు ఊయల
కావాలంటె ఎలా?
మీ బిడ్డల్ని పట్టు పరుపుల
మీదపడుకోబెడ్తే ఎలా?
జీవితమంటే అద్దం ముందు
నిలబడి అలంకరించుకోవడం కాదు
ఏ రాపిడి లేకుండా వజ్రం ఎలా మెరుస్తుంది
ఏ శోధన లేకుండా సిరి(లక్ష్మి)
నీ దరికి ఎట్లా చేరుతుంది?
పునాది లేకుండా ఇల్లు నిలవుది
పుణ్యానికి వచ్చిన డబ్బు నిలువదు
అందమైన చందమామను కోరి
ఆకాశానికి నిచ్చెనలు వేస్తే ఎలా
జ్ఞానాన్ని బోధించే గురువుల
కొరకు శోధించాలి.
మలినమైన మనస్సుతో శుద్ధిలేని శరీరముతో
జారుడు బండ మెట్లు ఎక్కి
దైవాన్ని దర్శిస్తాను అంటే ఎలా?
పవిత్రమైన భక్తి శ్రద్ధలుండాలి.



–కోణం పర్శరాములు
9959524585

## మద్యాన్ని మానండి- ఆరోగ్యంగా జీవించండి

మద్యమనే మహమ్మారిబారిన పడొద్దు
ఆ మాయావి ఊబిలో దిగొద్దు
పరిచయానితో ఆరంభమై, ఆపై
వదిలిపెట్టని పిశాచి అది, రుచిలేని అశుచది

తీసుకున్నప్పుడు తెలియనిది
తర్వాత దాని గుణము తెల్పేది
వేర్వేరు రూపాల్లో కోకల్లులుగా ఊరించి
వేలవేల జీవితాల్ని బలిగొన్న మండే నిప్పు అది

మనిషిని రాక్షసుడ్ని చేసే
మనిషి పతనానికి నాంది పలికేది
బహు ప్రమాదకారి అది
మనిషి మాన, ప్రాణాలను హరించే
హాలాహలము
మనిషిని నిలువునా మ్రింగే గరళము

మద్యానికి అలవాటు పడినవారి
జీవితము అథోపాతాళమే
నివారణే లేని పెద్ద రోగమే

విషము చిమ్మిన పాము విషముకైనా
విరుగడ వుంటుందేమో,
మద్యమనే విషమునకు విరుగుడు వుండదు
మద్యమునకు అలవడిన వారి
కుటుంబాలలో రేగేను కలతలు
చెలరేగేను అనుమానవు అగ్ని శిఖలు
బందువులు, మిత్రులు, సోదరులు
చివరకు తల్లి, భార్య కూడా బాధితులై
అసహ్యించుకొనే నికృష్ట జీవితము
మద్యము తీసుకొనేవారి జీవితము

మద్యపాన సేవనము వల్ల
కరిగిపోవును ఆస్తులు-కర్పూరమువలె
చెదరిపోవును మంచితనము గాలివానవలె
వెడలిపోవును అందరు ఒంటరినిచేసి
తరిగిపోవును ఆయువు-ఆరిపోతున్న దీపమువలె

మానవ సమాజములో మార్పు కోసం
ఆరోగ్యంగా, హార్థికంగా చేర్చుకోసం
రండి, కల్సిరండి-మద్యపాన నిషేధంపై
సమరం సాగిద్దాం-మద్యాన్ని మాన్పించి
మనుష్యులందర్ని ఆరోగ్యంగా వుంచేందుకు
ముందడుగు వేద్దాం-వేయిద్దాం.



– విశ్వనాథ నరసింహం
9490971589

## ఎన్నాళ్లైనా

ఏది చెట్టు
ఏది ఫలం
ఏది ప్రతిఫలం
ఇది నిష్ఫలమేగా

సింగినపల్లిలో
ఫలాల చౌర్యం
బక్కోడి ఆకలో
తినాలనే ఆశో

పెత్తందారీ
పెత్తనం
గ్రామ పంచాయితీ కార్యాలయ వేదిక
ఒళ్ళంతా పొట్టు పొట్టు
అయినా విడవని ప్రాణం
ఉరిమిన కళ్ళు
దూలానికి వేలాడిన బక్కోడు

శాంతించిన కామందు
రోదించిన బక్కోడి బలగం
న్యాయమా అన్యాయమా
తేల్చేదెవడు?
ప్రాణం తేలేని ఎక్స్‌గ్రేషియా
విదిలించే రాజ్యం
హంతకుడు మామిడితోటలో
సేద తీరుతాడు

రాజ్యం మారదు
దాని దిశ మారదు
దశ మారని బక్కోళ్ళ బతుకు చిత్రం
మతం కాని మతంలో
బక్కోళ్ళ స్థానం అదే

ఎక్కడ మార్పు
నువ్వు రాజ్య త్రిభుజంలో కింద
బలం నీది
రాజ్యం వాడికనుసన్ననలో
ఎన్నాళ్లైనా ఇంతేనేమో?!



–గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

## "భూ బకాసురుడు"

"మట్టిని నమ్మినవాడు
తల్లిని ప్రేమించి పూజించినవాడు
ఎన్నడూ చెడిపోడన్నది
నగ్నసత్యం.
పాడి పంటలతో విరాజిల్లే
మన భరత భూమిని
గునపాలతో తెగపొడిచినా
నాగళ్ళతో తెగచీల్చినా
కోపగించుకొనక
ఆహారపానీయాలను
బంగారు పంటలను అందించి
నీ కడుపునింపుతుంది భూమాత.
నువ్వు స్వార్థ పూరితుడవై
బంగారు పల్లకీలో ఊరేగాలని
ఆశా పూరితుడివై
తింటున్న అన్నాన్ని
కాల దన్నుకొని
నిస్సంకోచంగా నిర్మొహమాటంగా
ధనరాశుల కోసం
భూమాతను తెగనమ్మి
మిద్దెలు, మేడలు సమకూర్చుకొని
కనకా భరణాలతో
తులతూగి
కానరాని అహంతో
నడయాడిన నువ్వు
కడకు పిడికెడు
బూడిదగా మారి చేరవలసింది
ఆభూగర్భంలోకే.



–రాయవరపు సరస్వతి
9885656356





### అత్తలూరి విజయలక్ష్మి

# హాస్య రచన 'అష్టావక్ర'

అత్తలూరి విజయలక్ష్మి గారు కథ, నవల రచయిత్రియే కాక, నాటక రచయిత్రి కూడా. నాటక రచన చేసిన రచయిత్రులు చాలా తక్కువమందే.

అష్టావక్ర నాయికలు అనే రచన కథ, నవల, వ్యాసం ప్రక్రియలకు సంబంధించినది కాదు. ఇది ప్రహసన రచన అనాలి. వీరేశలింగం గారు, చిలకమర్తి వారు ప్రహస నాలు రచించి, హాస్యమే కాక అధిక్షేపాత్మకతకి ప్రాధాన్య మిచ్చారు. ఈ రచన హాస్యరచనగా అనిపిస్తూ, నేటి టీవీ సీరియళ్ళపై సంధించిన అధిక్షేప బాణం.

ఈ నాయికలందరి పుట్టిళ్ళూ.. టీ.వీ. సీరియళ్లే. వారి వారి పాత్రల స్వభావాలకు అనుకూలంగా పేర్లు పెట్టింది రచయిత్రి.

ఇందులో ప్రధానపాత్ర ఇల్లాలు సుబ్బలక్ష్మి. మంచి సంసారి. కథలు రాస్తూ చాలా కథలు వెనక్కి తిరిగొచ్చినా చింతపడని రచయిత్రి ఆమె. భర్త బాలకృష్ణకి తన భార్య రచయిత్రిగా గొప్ప పేరు తెచ్చుకోవాలని కోరిక. "నీ మాట విని ఆ పిచ్చి పిచ్చి కథలు రాయటం మానేసి, ఓ మంచి టీవీ సీరియల్ రాయి తప్పకుండా సక్సెస్ అవుతావు అని ప్రోత్సహించాడు.

వీరోత్సాహంతో ఇరవై సంవత్సరాలునడిచే, వెయ్యికి పైగా సీరియల్స్ రాయాలని నిశ్చయించుకుంది సుబ్బలక్ష్మి. బ్రేక్‌ఫాస్ట్ చేసి, వంట కూడా చేయకుండా సీరియల్ రచనకి ఉపక్రమించింది సుబ్బలక్ష్మి- భర్త ఆ సీరియల్ హీరోయిన్ పేరు పెట్టాలని సుబ్బలక్ష్మి ఆలోచన. 'నీ హీరోయిన్ పేరు అష్టావక్ర-నా మోహాన కాస్త ఉప్మానో, బజ్జీలో పెట్టవే అన్నాడు నీరసంగా బాలకృష్ణ.

'ఇలా మొదలై 'ఇంక నా కలం ఆగదు" అంటూ ఉత్సాహపడిపోయింది. మనందరం టీవీ. సీరియళు చూస్తూనే వున్నాం. ఆడరౌడీలు, ఆడవిలన్లు, మోసగత్తెలు వున్నవి చూస్తూ బాధపడుతున్నా చూడటం మాత్రం మానటం లేదు.

రచయిత్రి అష్టావక్ర నాయికల పేర్లు నీదిల్, పాపిల్, వంచిత్, జిత్తు- ఇలాంటివే. ఈ పాత్రలు కుటిలత్వాన్ని హాస్యంగా చూపించటం లోనే ఈ రచన ప్రత్యేకత కనిపిస్తుంది. కోడలి పుట్టిన రోజునాడు పాయసంలో విషం కలపటం, చీరల బీరువాలో పామును పెట్టడం, రౌడీలకి డబ్బిచ్చి చంపించే ప్రయత్నం చేయటం ఇలాంటివెన్నో-. నాయికలెవరూ శారీరక అష్టావక్రలు కారు. అందరూ మానసిక అష్టావక్రలు..

ఈ సీరియల్ నాయికలు ఎల్లవేళలా గొప్ప పట్టు చీరలతో అలంకరణలతో ధగధగమెరిసిపోతూ వుంటారు. వీరంతా ఒక కుటుంబంలోని వారే. మేనత్త, మేనకోడలు, కూతురు, తల్లి, వదిన ఇలా అందరూ దుష్టులే.

మనం చూస్తున్న సీరియళ్ళు గ్రంథస్థం చేసి చూపించారు రచయిత్రి. ఇంత భయంకరమైనవా మనం చూస్తున్నవి అంటే, ఆ శ్రమ, మీవల్లనే మాకు రేటింగ్ నిలుస్తోంది అంటుంటే ఇంకా రెచ్చిపోయి కుటుంబవ్యవస్థని కూలగొడుతూ, కుట్రలతో, కుటిల పన్నాగాలతో సీరియల్ రచయిత్రులు విజృంభిస్తున్నారనేది నిజం.

విజయలక్ష్మిగారు ఈ రచనకి అద్భుతమైన మలుపునిచ్చారు. సుబ్బలక్ష్మి 20 సంవత్సరాలకి సరిపడా రాయటమే కాక, గేమ్‌పాస్ కూడా రావాలని కంప్యూటర్ ముందు కూర్చుని లేవకపోవటం, సీరియల్‌కి చాలా డబ్బు ఇస్తాననే వాడి మోసంలో పడే పరిస్థితికి రావటంలో, ఆఖరికి భర్త బాలకృష్ణ విసిగిపోయి, **'సీరియల్ లేదు- గాడిద గుడ్డులేదు. సీరియల్ మాటెత్తితే విడాకులిచ్చేస్తా- తోచకపోతే ఓ రెండు గంటలు సమాజసేవ చేయ్యి'** అంటూ రెండు ముక్కలయిన కీ-బోర్డును ఆనందంగ చూసాడు. ॥హమ్మయ్య॥

అత్తలూరి విజయలక్ష్మి రచన హాస్య రచనగా చాలా ప్రత్యేకంగా వుంది అనేది అక్షర సత్యం. హాస్య రచన చేయటం చాలా కష్టం. విజయలక్ష్మి గారి హాస్య రచన పాఠకులకు అలరింపజేస్తుందని నమ్ముతూ, అభినందనలు తెలియజేస్తున్నాను.

ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
33-22-2, చంద్రం బిల్డింగ్స్,
చుట్టుగుంట, విజయవాడ-520 004.
-ముక్తేవి భారతి
సెల్: 9989640324



-ముక్తేవి భారతి
సెల్: 9989640324

పుస్తక సమీక్షలు

# కాసర్ల కవిత్వ గంధం- 'కాల గంధం'!

'కాల గంధం' కాసర్ల నరేశ్‌రావు మరో కవితా సంకలనం. కవనకిరిటి కాసర్ల నరేశ్ రావు మరో కలికితురాయి 'కాలగంధం' మినీ కవిత్వం .'కాల గంధం' అద్భుతమైన రహస్య సమాసం. దీనిని విగ్రహవాక్యం చేస్తూపోతే పఠిత విగ్రహంలా అలాగే చదువుతూ కాసర్ల కవిత్వంతో తాదాత్మ్యం చెందుతాడు. చిన్న చిన్న కవితలు పెద్ద పెద్ద విశ్వాలు.

ఐనా ఎవరికి వారే గంధం పూసుకుని ఆనందించేవారే. కాని కాలస్వరూపుడైన పరమాత్మునకు కవిత్వం గంధంపూసి, కవితలతో గొప్ప ఆరాధన చేశాడు కాసర్లకవి. తక్కువ కాలంలో ఎక్కువ సంకలనాలు ప్రచురించిన లోక స్పృహగల కవి.

పూర్వ కవులు గంటంతో తాళపత్రంపై కావ్యాలు రాశారు. తరువాత కాగితం వచ్చింది. పొడుగాటి కలాన్ని సిరాబుడ్డిలో మాటి మాటికి ముంచుకుంటూ మహా ఓపిగ్గా రచనలు కాగితంపై రాశారు. కాలక్రమేణ పెన్నులతో రాస్తున్నాం. కాని కాసర్ల నరేశ్‌రావు ఆధునికంగా ఆవిష్కరింపబడ్డ సెల్లు ఫోనులో కవిత్వాన్ని టైపు చేసి అందరి మిత్రులకు పంపారు. కవిత్వం కాలగమనంతోఅందరి సెల్లులో కోయిలై కూసింది.

రాష్ట్రంలోనే కాక దేశంలోనే ప్రప్రథమంగా వచ్చిన సెల్లుఫోను కవిత్వం 'కాలగంధం'. ఒక రకంగా ఇది గిన్నిసు రికార్డుగా అనుకోవచ్చు. అందరికీ ఇది 'poetry hand book'.

'కాలగంధం', కవిత్వం ఆవిర్భవించిన రోజు 2009 వినాయక చవితి రోజు. అందుకే అవిఘ్నంగా సాగి కవితా సంకలనమై అందరి చేతుల్లోకి సెల్లుఫోనులా వచ్చేసింది. విన్నది అక్షరాల అపురూపమైంది 'కాలగంధంగా'!

అనంతమైన కాలానికి గంధం పూయడమంటే వొట్టి మాటలా! కాదు- కవిత్వంలోనే సాధ్యమైంది కాసర్లకి. కాలస్వరూపాలైన మూడు కాలాలకు 'వేసవి దీవెన', 'వర్షపరిమళం', 'శీతల లేపనం', అంటూ బిరుదులు ప్రదానం చేసి వాటిని తన సుమధుర మృదువైన కవిత్వంతో అర్చన చేశారు కాసర్ల నరేశ్‌రావు.

కవి తాను ప్రకృతిలో నిరంతరం మమేకమై ఉంటాడు. తాను చూసిన, విన్న, స్పృశించిన సమస్త జగతిని కావ్యం చేస్తాడు. మొదట 'వేసవి వోవెన' ప్రథమ కవితలో మొలక 'లేత ఆకులతో నవ్వింది'! అంటూ సరికొత్తగా చెప్పాడు. వేప చెట్టుకుండే గుంపైన పూలను అందరూ చూస్తూనే ఉంటారు. కాని కవి కాసర్లకు ఆ పూల గుత్తి కిరటంగా తోచి 'చేదు వేప చెట్టు కూడా పూల కిరటంతో తీయని అనుభూతిని పంచుతున్నది! అన్నాడు. కవికి అన్నీ కవిలాగే కనిపిస్తాయి. 'చెట్టును మించిన కవి లేడనిపిస్తున్నది. ప్రతిరోజూ కొత్త ఆకులతో పచ్చని కవితాసందేశం పంపుతున్నది' అంటూ చెట్టును పచ్చని కవిగా మనందరికి పరిచయం చేశారు కాసర్ల. ఇంతవరకు 'వసంతం సంతకం' ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. కాసర్ల 'చెట్లపై పూల సముద్రం వసంత సంతకం'గా దర్శించి చెట్లకు తన కవితా గంధాన్ని అద్ది చెట్లనే పులకరింపజేశాడు. బాల్యం నుండి





అందరికీ అనేక అనుభవాలు. అందరి అనుభవాలను తన అనుభవాలుగా విశ్వ స్పృహతో 'కొత్త మామిడి కాయలు- కొంటెగా నవ్వినప్పుడల్లా- నోట్లో లాలా జల సముద్రాలు!' అని మామిడి కాయను అందరి చేతుల్లో పెట్టేశాడు కాసర్ల నరేశ్‌రావు. ఫుట్‌పాత్ పక్కనే 'ఖర్బూజ'లను ఎందరు చూడటంలేదు. కాని కాసర్ల కంటపడి ఆ వస్తువు ధన్యమైంది. ఎడారి పులకరించింది. 'పగటి ఎండవేళ- కడుపులోకి దిగిన చల్లని చందమామ ఖర్బూజ' అని అందరి కడుపులను చల్లగా కవిత్వంలో గంధం అద్దాడు. ఖర్బుజ గుండ్రటి ఆకారం, దాని చల్లటి గుణం-పగటి వాతావణం అది చంద్రుడవడం ఎంత చిత్రం. కవి మరో బ్రహ్మ. కొత్త సృష్టి చేయగలడు. ఈ ప్రపంచంలోని ఖర్బూజలన్నీ ఆనందపబడి ఉంటాయి. పైన చంద్రుడూ ఆనందించి ఉంటాడు. ఈ కవిత్వాన్ని అందరూ ఎప్పుడూ జ్ఞాపకం చేసుకుంటారు. ఇవి బాలలకైతే కంఠపాఠం ఔతాయి! మరో అద్భుతమైన కవితీకరణ 'సూర్యున్ని పయ్యను చేసి గిరగిరా కొట్టుకుంటూ- కాల బాలుడు ఒక్క రోజులోనే- భూమిని చుట్టి వస్తున్నాడు!" అంటూ సూర్యున్ని పయ్యగా పోల్చి చెప్పటం సరికొత్త ఉపమానం. కవి చూపు అనంతానంత కాలాలను విశ్వ గోళాలను టెలిస్కోపు లేకుండానే చూడగలదు. కవిద్రష్ట అందుకే కాసర్ల నరేశ్‌రావు సూర్యున్ని గిరిగిరా భూమి చుట్టూ తిప్పేశాడు. కవి సూర్యుడు- కవి శూరుడు కాసర్ల. సూర్యుడు, భూమి ఎంత ఆనందపడు తున్నాయో మరి! ఇది ఊరగాయల వేళ. ఇక్కడ కవి సమయం 'ఊరంతా ఊరగాయకుండ ఔతున్నది!' ని సామూహిక ఊరగాయల పండుగను శాశ్వతంగా కవిత్వం చేసి లాలాజలాల ఊటబావుల్ని ఎండకుండా కొత్త సృష్టి చేశాడు కవి కాసర్ల. ఇలా 'వేసవి దీవెన' 24 గిన్నెల కాలగంధమై అందమై చందమై అందరూ కలవరించే కావ్యగులిక ఐంది.

కాసర్ల నరేశ్‌రావు ఎండకాలం కవితలతో పఠితకు ఉబ్బరం కలిగించకుండా వెంటనే 'వర్ష పరీమళం'లోకి తీసుకెల్లాడు.మొదటి పరీమళం 'రాస్తున్న అక్షరాలు తడివాసన వేస్తుంటే అర్థమైంది- ఋతుపవనాలు దేశ సరిహద్దుల్ని తాకాయని'! అంటూ వర్ష గమనానికి తన కవిత్వాన్ని గంధం చేసి మెప్పించాడు కాసర్ల. కవి అక్షరాలు నిజంగా ఎప్పుడూ తడిగానే ఉంటాయి రసహృదయం మనదైతే. ఈ సంకలనంలో హృదయాన్ని ఉంచి చదివితే ప్రతి పేజీలో కొత్త పదచిత్రాలు కనిపిస్తాయి. 'వానపక్షి' అనడం ఎప్పుడైనా విన్నారా! చదివారా! దుమ్ము నిండిన వాకిలి మీద-తెల్లారేసరికి చినుకుల పాదముద్రలు- 'వానపక్షి' రాత్రి- వచ్చి వెళ్ళినట్లున్నది. వాన పక్షిలాగ వస్తుంది. పక్షిలాగే వెళ్తుంది. మళ్లీ కనపడదు. వాకిలి తడి మాత్రం ఔతుంది. ఈ సజీవ దృశ్యాన్ని కాసర్ల కవిత్వంగా గంధం గిన్నెగా చేసి చదువులకు అద్దుకొమ్మని చెప్తున్నాడు. ఒక కవి కవిత్వాన్ని సమీక్షిస్తూపోతే కాలం చాలదు. కలం చాలదు. కాగితాలు చాలవు. అలాగే కాసర్ల కవిత్వం కవిత్వాన్ని నిత్యశ్వాసగా స్వీకరిస్తూ- నిద్రలో కలవరిస్తూ- మెలుకువలో కవిత్వం రాస్తూ- అన్నింటిని కలిపి మళ్లీ సంకలనంగా వేస్తూ కవిత్వాన్ని శాశ్వతం చేస్తున్న కవి కాసర్ల ఇందూరునే కవిలోకం చేస్తున్నాడు. అందరూ కవిత్వం రాయటమే కాదు- సంకలనం వేసుకోవాలని ఉత్సాహాన్ని కలిగిస్తున్నాడు.

ఈ 'కాలగంధం', సంకలనం తెరిచి కవిత్వం చదువుతుంటే ఎక్కడా పఠిత ఆగలేదు. అడుగడుగున అనుభూతిని సొంతం చేసుకుంటాడు. 'వర్ష పరిమళంలో మరో పరిమళం 'వాన వెలిసాకా నగరం పిండి ఆరేసిన తువ్వాలైంది'! అని వానకాలం వర్ణణలను మన ముందుంచి తడి తడి చేస్తున్నాడు. మనిషిలో త్రిగుణాలున్నట్లే చెట్లకు గుణ మోగాలను ఆపాదించాడు కాసర్ల. 'వాన- సాత్వికం-వరద రాజసం-తుఫాను-తామసం- ప్రకృతిలోంచే జీవితం'అని వర్షాన్ని త్రిగుణాత్మకంగా జీవింపజేశాడు. 'వాన చుక్క నీకు వందనమ్ము' అంటూ పద్యాలను గంధాన్ని సంకలనంలో గంధమాధన పర్వతం చేశాడు. వర్ష పరిమళ కవితలు 53గా మిగతా కాలాలకన్న ఆధిక్యతతో ఉన్నాయి. జనానికి వర్షమే ముఖ్యం- చెట్లకు సమస్త జీవజాలానికి వర్షమే జీవం. అందుకే కవిగారు వర్షాన్ని ఎక్కువగా కురిపించారు. వర్షాన్ని పాముగా పోల్చి పంటలను ముంచుకుమా అని వలదు.. వలదు అంటూ కవితీకరించాడు. వర్ష ఋతువు వెళ్లినాక కవి జ్ఞాపకంగా 'వానపూల చెట్టు వాడదెపుడు' అంటూ వానకే తన కవిత్వ గంధాన్ని అద్ది తడి చేశాడు.

'కాలగంధం' చదివే ఆపేక్ష గల పఠిత ముందు మనసారా' 'వేసవి దీవెన'ను అనుభవించి-తరువాత ఆ తాపం చల్లారేలా 'వర్ష పరిమళం' గ్రోలాడు. తరువాత 'శీతల లేపనం' పొందితేనే ఈ కవిత్వం చదివిన ఫలం దక్కుతుంది. గొప్ప చమత్కారం శీతల లేపనంలో మనకు ఉదయమౌతుంది.

సూర్యుడినే చలిమంట అనడం కాసర్లకు కలంతో పెట్టిన కవిత్వ విద్య. 'చలితో గడ్డకట్టుకు పోయిన-భూశరీరానికి వేడి పుట్టించే ఆకాశ చలిమంటే- సూర్యుడు' అంటూ భూమి చలిని పోగొడుతాడు. పొద్దున్నే టీ కోసం అందరం వేచి చూస్తాం! ఆ సమయాన్ని కవి కవిత్వం చేశాడు 'చలి రాక్షసున్ని ఎదిరించే చాయి అయుధం కోసం ఒక మబ్బున్నుండి తపస్సే చేస్తున్నా- పాలదేవుడు కరుణించడే' వేళకు రాని పాలవాడి కోసం పాల ప్యాకెట్ కోసం కవి కవిత్వం చిలికాడు ఇక్కడ.సామాన్యుడికి సన్మానం ఎవరు చేస్తారు. ఎవరూ చేయరు. కాని చలితో నాల్గు పంక్తుల్లో కవి చేయించాడు. అదే 'చలిది పెద్ద కళా హృదయం- సామాన్యుల్నీ కళాకారున్ని చేసి- దుప్పట్లు కప్పి సన్మానిస్తున్నది! కవికి నూరుకన్నులు వేయి హృదయాలు అందుకే కవి ఆర్ధ్రత చెంది సామాన్యునికి సన్మానం అయేలా కవి సమయంగా చలిని శిఖరాయమానం చేశాడు. కాసర్ల గతంలో సృజన చేసిన 'కాలస్పర్శ'ను మళ్లీ సుమధురంగా సింహావలోకనం చేసుకొని ఆ శీర్షికను చికాకు- ఎండాకాలం, దుఃఖతడి వానాకాలం, హృదయాహ్లాదం- చలికాలం అంటూ మనిషిలోనే కాలస్పర్శ అని కాలస్పర్శతోనే మనిషి జీవనమని కాలగంధాన్ని సంపూర్ణంగా నిండు గిన్నెనిండా మనకు అందించాడు. ఈ సంకలనంలో గంధం కాలమైంది-కాలం గంధమైంది!

'హరిదా రచయిత సంఘం'వారు ఈ 'కాలగంధాన్ని' ముందు ఆస్వాదించి వేదిక ద్వారా అందరికి కాల గంధాన్ని అందించాడు. కాసర్ల నరేశ్‌రావు 'కాలగంధం' నాల్గవ కవితా సంకలనం. ఇవన్నీ సెల్‌ఫోన్‌లో ముందు ఊటగా పుట్టి తరువాత 'కాల గంధం' నదిగా ప్రవహించి అందరి హృదయాలలో గంధంగా నిలిచిపోయాయి. కవి వేల కవితల్ని రాసినా అచ్చు వేస్తేనే సార్థకత. శ్రీ కాసర్ల నరేశ్‌రావు ఇంత చిన్న వయసులోనే కవిత్వాన్ని రాయడమే కాకుండా నాల్గు సంకలనాలుగా వాటికి అమరత్వాన్ని ప్రసాదించాడు. నిజామాబాద్ జిల్లాలో అరుదైన ఆర్థతామయమైన కవిత్వాన్ని రాసి లోకానికి పంచిన వారిలోనూ పట్టాభిషిక్తుడే. కవులందరికీ ప్రేరణగా ముందున్న వాడే. పిన్న వయసు.గొప్ప కవిత్వం-నాల్గు సంకలనాలు సృజన. మళ్లీ ఇంకా దగ్గరిలోనే మిగతా సంకలనాలు!

కవి ఎప్పుడూ నిద్రపోడు! కవిత్వం గురించే ఆలోచిస్తాడు. రాస్తాడు. లోకానికి వినిపిస్తాడు. కవిత్వాన్ని చిరంజీవి చేయడానికి సంకలనంగా సంపూర్ణతనిస్తాడు. అందుకే ఇతడు కవన కిరీటి.

ప్రతులకు: కాసర్ల పబ్లికేషన్స్
ఇ.నెం. 10-14-1870/1
సీతారామ్‌నగర్ కాలనీ,
నిజామాబాద్
సెల్: 9441106252



– కందాళై రాఘవాచార్య
9908612007

## గుంతలో రహస్యం!

ఒక గుంత తవ్వుకుని
లోపల భద్రంగా
ముడుచుకుంటారు
కాంట్రావర్సీలు
మనకెందుకనుకుంటారు.

గుంతపైన మాత్రం
కొంత ఖాళీనొదులుతారు
తమవయిన కలల దారాలకు
రంగురంగుల బెలూన్లను కట్టి
నింగిలోకి ఎగరేస్తారు.

ఆహా ఓహోల కేరింతల
శబ్దాల కోసం
చెవులు రిక్కిస్తారు
గుంతలో నుంచే భద్రంగా

అప్పుడప్పుడు రాలిపడే
మట్టి పెళ్లల గురించి కూడా
కాస్త అప్రమత్తంగానే వుంటారు

గుంతలోకి నీళ్లొచ్చేదాకా
వీళ్లింతే
కళ్ల గుంతల్లోని
కన్నీటి గురించి మాట్లాడరు
మూసుకుపోయిన కళ్ల వెనుక
కలల గురించే ఏకరువు పెడతారు.

సత్యం మీద గుడ్డ కప్పి
అబద్దాల మత్తు జల్లి
లోకాన్ని నిద్ర పుచ్చుతారు
అచ్చం వీళ్లు గుంతలో
మునగదీసుకున్నట్లుగానే
కాంట్రావర్సీలు
మనకెందుకనుకుంటారు.
గుంతపైన వదిలిన
ఖాళీలోంచి మాత్రం
అందరూ తమనే చూడాలని
కోరుకుంటారు!



– చిత్తలూరి
9133832246

## చమ్కీలు

బ్రహ్మ ఆడే నాటకంలో
మనమంతా తోలు బొమ్మలం
దారం తెగిపోతే
ప్రాణం పోతుంది
నీటి బుడగ వంటి జీవితం
క్షణంలో మాయం.

కవర్ల మీద
దేవుళ్ళ చిత్రాలు
పని అయ్యిందంటే
చెత్తలో చేరును
భక్తుల మనోభావాలకు
పెను అపచారం
నిషేధిస్తే గౌరవం

మురికి గుంతలు
దోమల నిలయాలు
యమపురికి దారులు
అధికారులు స్పందిస్తే
ప్రజలకు ఆరోగ్యం
లేదంటే నరకం
ఆరోగ్యమే మహాభాగ్యం.

– జేపీరావు పాటిల్
9441333315

## నాన్న

అతడో బద్దలైన అగ్ని పర్వతం
బాధ్యతల లావా ఎప్పుడూ
ఉప్పొంగుతూనే ఉంటుంది

పట్టి నడిపించిన చేతులు
చేజారిపోతుంటే
మౌన సాక్షిగా నిలుస్తాడు.

చుట్టాలందరినీ కలుపుకొచ్చి
బిడ్డను సంఘ జీవిని చేస్తాడు

బిడ్డ అనారోగ్యం గురించి
తన్లాడే అర్ధాంగికి
కండ్లతో ధైర్యం నూరిపోస్తాడు

కండ్లలోకి ఇంకిన బాధను
పెదాలపై చిరునవ్వుతో
పటాపంచలు చేస్తాడు

కొండంత బాధ్యత
అండగా ఉన్నంక
మాకు బాధ్యతలెట్లా తెలిసొస్తవి

ఆ ప్రశాంతత, ఆత్మీయత
ధైర్యం నింపే కండ్లు
చెరిగిపోని చిరునవ్వు
అదృశ్యమయ్యాక తెలిసొచ్చింది

కన్నబిడ్డలను, కట్టుకున్న ఆలిని
నెగ్గుకొచ్చే ప్రయత్నంలో
ఎన్నో నిద్రలేని రాత్రులు
గడిపిన ఆ కళ్ళు
శాశ్వతంగా విశ్రాంతిని తీసుకున్నాయని



– కరుణాకర్ గుండు
9866899046


## పరోపకారం

చిరునవ్వును చెక్కిట దాల్చి
ఒంటిని వింటి గా మలచి
పరోపకారమే పరమ ధర్మమని
సమస్యలతో వనవాసం చేస్తూ
పస్తులతో ఉపవాసం ఉంటూ
సరిహద్దుకు రక్షణ కంచై ఒకరు
కంచంలో మెతుకు బ్రహ్మై ఒకరు
ఆ ఇరువురి భక్తుల ది వెలకట్టలేని సేవ

బురద తో సహవాసం ఒకరిది
ప్రాణాలతో చెలగాటం మరొకరిది
దిన దిన గండమే ఇరువురి ది
అయినా ఇరువురు భరతమాత సేవలో
నిమగ్నమైన కార్యశూరులు


రాజనీతిని యుద్ధనీతిని దౌత్య నీతిని
పుణికిపుచ్చుకున్న చాణక్యులకు
దేశ రక్షణలో ప్రాణాలను ఎదురొడ్డే
శౌర్య సేనలను సృష్టించిన విప్లవ బ్రహ్మలకు
పుట్టినిల్లు నా భారతావని

దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసే వీర కిశోరాలకుపుట్టినిల్లు
జాతీయ వాదాన్ని నరనరాన ఒంపుకొని
విలువల వెంట విజ్ఞతతో నడుస్తూ
దేశ రక్షణే సర్వస్వంగా
ఊపిరినే ఉరికొయ్యలకు బహుమతి ఇచ్చిన
త్యాగాల గాథలెన్నో చరిత్ర మడతల్లో



– కరాదుల.. అరుణ కీర్తిపతాక
9395147443


# పత్రికారంగానికి తీరని లోటు



10.9.1939 - 28.10.2019



- డాక్టర్ రాయారావు
సూర్యప్రకాశ్ రావు
9441046839



ఇతరులెవరితోనూ కలిసి కనీసం భోజనం కూడా చేయని సాంప్రదాయిక శ్రీవైష్ణవ కుటుంబంలో పుట్టిన ఆయన అనంతర కాలంలో మార్క్సిజాన్ని అధ్యయనం చేశారు. కమ్యూనిస్టులకు, విప్లవ యోధులకు పెట్టని కోటలాంటి జనగామ ప్రాంతానికి చెందిన ఆయన కమ్యూనిస్టు విద్యార్థి సంఘ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. తొలి రోజుల్లో సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన ఆయన కమ్యూనిస్టుల వాణి 'విశాలాంధ్ర' సంపాదక బాధ్యతలను మూడు దశాబ్దాల పాటు నిర్వర్తించి, ఉత్తమ సంపాదకునిగా పేరు పొందారు. ఆయనే చక్రవర్తుల రాఘవాచారి.

ఒకప్పుడు నల్గొండ జిల్లాలో ఉండి, అనంతర కాలంలో వరంగల్ జిల్లాలో కలిసి, ప్రస్తుతం జనగామ జిల్లాలో ఉన్న పాలకుర్తి మండలం శాతాపురం రాఘవాచారి స్వస్థలం. ఎనబై ఏళ్ల క్రితం 1939 సెప్టెంబరు 10వ తేదీన 16 మంది సంతానంలో ఒకరిగా ఆయన జన్మించారు. ఎవరితోనూ కలవని సాంప్రదాయ ఆచారాల వాతావరణం ఇంట్లో ఉండేది. కమ్యూనిస్టు భావజాలం అధికంగా ఉన్న ఆ ప్రాంతం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఒకప్పుడు కేంద్ర బిందువు. ఆ పోరాటంలో అసువులు బాసిన తొలి వీరుడు దొడ్డి కొమురయ్య స్వగ్రామం కడవెండి ఆ ఊరికి కేవలం పది కిలోమీటర్ల దూరం.

ఈ విధంగా పరస్పర వ్యతిరేక భావజాలాల మధ్య రాఘవాచారి పెరిగారు. ఇంట్లోనే తొలి దశలో విద్యను అభ్యసించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల ద్వారా తెలుగు, సంస్కృతం, ఉర్దూ భాషలను నేర్చుకున్నారు. అక్కడే ధారణగా పద్యాలు, శ్లోకాలు చదవడం అభ్యాసమైంది. నాటి ప్రత్యేక పరిస్థితుల్లో 1948లో హైదరాబాదు సంస్థానంపై పోలీసు చర్య అనంతరం కూడా కమ్యూనిస్టు సానుభూతిపరులు అధికంగా ఉన్న గ్రామాలపై దాడులు జరగడంతో రాఘవాచారి కుటుంబం ఆయన అమ్మమ్మ ఊరైన కృష్ణా జిల్లా బొకినాల అగ్రహారానికి చేరింది. అక్కడ కూడా ఇంట్లోనే కొద్ది కాలం చదువుకున్నప్పటికీ అనంతరం గుంటూరు జిల్లా పొన్నూరులో భావనారాయణ స్వామి దేవాలయ నిర్వహణలోని సంస్కృత పాఠశాలలో రెండేళ్ల పాటు చదువుకున్నారు.

తర్వాత సికింద్రాబాదులోని హైదర్‌బస్తీ పాఠశాలలో ప్రవేశ పరీక్ష రాసి, ఆరో తరగతిలో చేరారు. ఆ తర్వాత బొల్లారంలోని ఉన్నత పాఠశాలలో, లాలాగూడలోని రైల్వే ఉన్నత పాఠశాలలో చదివి హైస్కూల్ చదువు పూర్తి చేశారు. 1956 మార్చిలో జరిగిన హెచ్.ఎస్సీ. పరీక్షల్లో హైదరాబాదు రాష్ట్రంలో 16వ ర్యాంకు పొందారు. దాంతో నిజాం కళాశాలలో పి.యు.సి.లో సీటు దొరికింది. హైదరాబాదు విద్యార్థి సంఘ నాయకులు రాజేంద్ర ప్రసాద్, బూర్గుల నరసింగరావు, సుప్రసిద్ధ సాహితీవేత్త చేకూరి రామారావు, ప్రముఖ కవి జె.బాపురెడ్డి, ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త సిహెచ్.హనుమంతరావు మొదలైన వారి సాంగత్యం వల్ల ఒకవైపు సాహిత్యాభిలాష, మరోవైపు అధ్యయనానురక్తి మొగ్గ తొడిగాయి. అదే సమయంలో అభ్యుదయ కవుల రచనలతో పరిచయం ఏర్పడింది. ఇవన్నీ తర్వాతి కాలంలో వామపక్ష భావజాలం వైపు రాఘవాచారి మొగ్గు చూపడానికి కారణమయ్యాయి. నిజాం కళాశాలలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాఘవాచారికి ఆసక్తి పెరిగింది. కళాశాలలో జరిగే వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో పాల్గొంటూ తన ప్రతిభను మెరుగుపరుచుకునేవారు. పి.యు.సి. పరీక్షల్లో విశ్వవిద్యాలయ పరిధిలో ఆరో ర్యాంకును రాఘవాచారి పొందారు. ఉత్తమ విద్యార్థిగా నిలిచిన రాఘవాచారికి ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్ లభించింది. కానీ ఇంజనీరింగ్ చదువు ఆయనకు నచ్చలేదు. దాంతో ఇంజనీరింగ్ చదువుకు గుడ్‌బై చెప్పి, వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బి.ఎస్సీ. పూర్తి చేశారు. అక్కడ చదువుతున్నప్పుడే కమ్యూనిస్టు

**వామపక్ష సిద్ధాంతాల నిరంతర అధ్యయనం వల్ల సామాజిక కార్యక్రమాల్లోనూ పాల్గొనడం ప్రారంభమైంది. అప్పుడే విద్యార్థి ఉద్యమాల్లో చురుకైన కార్యకర్తగా పేరుపొందారు.**

సిద్ధాంతాల పట్ల ఆకర్షితులయ్యారు. నిరంతర అధ్యయనం ఆరోజుల్లో ఆయనను రాటుదేల్చింది. కళాశాలలో సైన్స్ విద్యార్థి అయినా సాహిత్యం పట్ల చక్కటి అభినివేశాన్ని ప్రదర్శించేవారు. అప్పుడే ఆయన తొలి రచన 'క్రీడాభిరామంలో ఓరుగల్లు వర్ణన' అనే వ్యాసం 'జనధర్మ' వార పత్రికలో ప్రచురితమైంది. అక్కడే బి.ఏ. చదువుతున్న వరవరరావు సంపాదకత్వంలో వెలువడ్డ కళాశాల మ్యాగజైన్‌లో శ్రీశ్రీపై ఆయన రాసిన వ్యాసాన్ని ప్రచురించారు. ఆ విధంగా రచనలపై ఆసక్తి పెరిగింది. వామపక్ష సిద్ధాంతాల నిరంతర అధ్యయనం వల్ల సామాజిక కార్యక్రమాల్లోనూ పాల్గొనడం ప్రారంభమైంది. అప్పుడే విద్యార్థి ఉద్యమాల్లో చురుకైన కార్యకర్తగా పేరుపొందారు. వరవరరావుతో పాటు అంపశయ్య నవీన్ వంటి వారి సాహచర్యం కూడా వరంగల్‌లో ఆయనకు లభించింది. 1959-60 సంవత్సరంలో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి సంఘ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. విద్యార్థి రాజకీయాల్లో చురుకుగా ఉన్నప్పటికీ చదువును నిర్లక్ష్యం చేయలేదు. చదువులోనూ ఉత్తమ విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు. 1960లో కళాశాల మ్యాగజైన్‌లో 'బ్రిలియంట్ స్టూడెంట్ ఆఫ్ అవర్ కాలేజ్' అనే ట్యాగ్‌లైన్‌తో ఆయన ఫోటో ముద్రించినట్టు కాళోజీ ఫౌండేషన్‌కు చెందిన నాగిళ్ల రామశాస్త్రి గుర్తు చేసుకున్నారు. విద్యార్థి సంఘ కార్యవర్గంలో ఉన్నవారు మాక్ పార్లమెంటులో అధికార పక్షానికి చెందినవారిగా ఉండడం సర్వ సాధారణం. కానీ దానికి భిన్నంగా రాఘవాచారి కళాశాలలో జరిగిన మాక్ పార్లమెంటు కార్యక్రమంలో ప్రతిపక్ష నాయకుని పాత్రను సమర్థవంతంగా పోషించారు. రాఘవాచారి 1960లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. వరంగల్‌లో డిగ్రీ పూర్తి చేసిన అనంతరం న్యాయ విద్యను అభ్యసించాలని నిర్ణయించుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి., ఎల్.ఎల్.ఎం. పూర్తి చేశారు. 1963లో న్యాయ కళాశాల విద్యార్థి సంఘాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1965లో ఎల్.ఎల్.ఎం. పూర్తి చేశారు. పార్టీ నిర్ణయంతో విశాలాంధ్ర పత్రిక విలేకరిగా ఉద్యోగంలో చేరారు. 1972లో ఆ పత్రిక సంపాదక బాధ్యతలు చేపట్టారు. మూడు దశాబ్దాల పాటు విశాలాంధ్ర సంపాదకునిగా పనిచేసి, ఉత్తమ సంపాదకునిగా పేరుపొందారు. చెప్పినదాన్ని ఆచరించి చూపాలనే నైజం కలవారు రాఘవాచారి. తన వ్యక్తిగత జీవితంలోనూ ఆదర్శంగా నిలబడి, కులాంతర వివాహం చేసుకున్నారు. ఇంజనీరింగ్ విద్యను తృణప్రాయంగా భావించి, సైన్స్‌లో డిగ్రీ చదివినప్పటికీ సాహిత్య అధ్యయనాన్ని నిరంతరం కొనసాగించిన వారు రాఘవాచారి. సాంప్రదాయిక కుటుంబంలో జన్మించి, వామపక్ష వాణికి సంపాదక బాధ్యతలను మూడు దశాబ్దాల పాటు నిర్వర్తించిన ఆయన మృతి తెలుగు సాహిత్యానికి, పత్రికా రంగానికి తీరని లోటు.





*19.10.2019న రంగస్థల నటుడు స్థానం నరసింహారావు జయంతి సందర్భంగా రంగస్థల నటి జమునారాయలును సత్కరిస్తున్న డా॥ఎ.చక్రపాణి, గుదిబండి వెంకటరెడ్డి, డా॥వోలేటి పార్వతీశం. చిత్రంలో మహమ్మద్ రఫీ, యలవర్తి రాజేంద్రప్రసాద్ తదితరులు.*

## నేడు రామప్పలో ఏక్తాదివస్

ములుగు,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): సర్దార్ వల్లభ్ భాయి పటేల్ వర్ధంతిని పురస్కరించుకుని ములుగు జిల్లా వెంకటాపూర్‌లోని రామప్ప దేవాలయంలో ఈనెల 31న రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించనున్నట్టు పురావస్తు శాఖ జిల్లా అధికారి మల్లేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఏడాది హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో నిర్వహించే వారని, ఈ సంవత్సరం మొట్టమొదటి సారిగా రామప్పలో నిర్వహించ నున్నట్టు చెప్పారు. ఢిల్లీ నుంచి కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ తాహిర్, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, కాకతీయ

విశ్వవిద్యాలయం టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం హెచ్‌వోడీ విజయబాబు తదితరులు హాజరుకానున్నట్టు తెలిపారు. ఉదయం 11 గంటకు హెరిటేజ్ వాక్, ప్లాస్టిక్ నివారణపై అవగాహన, అనంతరం కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో చారిత్రక

# కొత్త పురపాలికల్లో ఆశావహుల రంగప్రవేశం

ఖమ్మం,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): కొత్త పురపాలికల ఏర్పాటు కారణంగా ఎన్నికల నాటికి వీటి సంఖ్య భారీగా పెరగనుంది. దీంతో రాజకీయంగా టిఆర్ఎస్‌కు కలసి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో పదవులు ఆశిస్తున్న వారు ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్నారు. వీరంతా అధికార టిఆర్ఎస్, కాంగ్రెస్ తరపున ప్రచారంలో దూసుకుని పోతున్నారు. పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయాలన్న ప్రభుత్వం సంకల్పానికి అనగుణంగా ప్రస్తుతం ఉన్న మేజర్ గ్రామ పంచాయతీల స్థానంలో పురపాలికలుగా ఏర్పాటు చేసారు. కొత్త మున్సిపల చట్టాన్ని ప్రవేశపెట్టి ఆమోదింప జేయడంతో కొత్తగా పలు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. వీటికి నిధులు, విధులు కేటాయించడమే కాకుండా అనుకున్న సమయానికే ఎన్నికలు నిర్వహించేలా హైకోర్టు కూడా ఆదేశించింది. అన్ని సౌకర్యాలను, మౌలిక వసతులను కల్పించడంతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు కుల, ఆధాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను కూడా ఆన్‌లైన్ పద్ధతి ద్వారా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొందే సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి రానున్నాయి. కొత్త పురాల ఏర్పాటుతో ప్రజల ముంగిట్లోకి ఊహించని రీతిలో పరిపాలనా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో పరిపాలనా సౌలభ్యంతో పాటు వెనుకబడిన మారుమూల ప్రాంతాల్లోని గ్రామాలు అభివృద్ధి

### చురుకుగా ఎన్నికల ప్రచారంలో నేతలు

చెందడంలో కీలక భూమిక కానున్నాయి. కొత్తగా అనేక మందికి పదవులు లభ్యమయ్యే అవకాశాలు కూడా లభించనున్నాయి. కొత్త పురాల ఏర్పాటుతో అనేకులు ఆశావహులుగా ఉన్నారు. వీరంతా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు.

## తేమ లేకుండా చూసుకోవాలి

ఆదిలాబాద్,అక్టోబర్30(ఆర్ఎన్ఎ): పత్తి, సోయా పంటలను రైతులు ఆరబెట్టుకొని మార్కెట్‌కు తీసుకొస్తే మద్దతుధర కంటే ఎక్కువ ధర లభిస్తుందని మార్కెట్ పాలకవర్గం సభ్యులు అన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో జీరో వ్యాపారం జోరుగా సాగేదని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతికి అడ్డుకట్ట వేశామన్నారు. రైతుల పంటలను నిలువ చేసుకోవడానికి ప్రభుత్వం గోదాముల నిర్మాణం చేపట్టిందని, అవి ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు తమ పంట ఉత్పత్తులను గోదాముల్లో నిల్వ చేసుకొని ధర పెరిగినప్పుడు అమ్ముకోవచ్చన్నారు. రైతులు పండించిన పంటలకు మార్కెట్ యార్డుల్లో మద్దతు ధర కలిపించి కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమేరకు అధికరాఉలు ఏర్పాటు చేశారని అన్నారు. తేమ శాతంపై రైతులకు అధికారులు అవగాహన కలిపించాల్సిన బాధ్యత అధికారులదేన్నారు. పండించిన పంటలను ఆరబెట్టుకొని మార్కెట్‌కు తీసుకొస్తే సీసీఐ మద్ద తు ధర కంటే ఎక్కువ చెల్లిస్తోందన్నారు.

## నిజాలు!

నీమాల్లో హక్కుకు చుక్కెదురు-
ఆస్తికతలో ఆచారాలే శిరోధార్యాలై.
కన్నీళ్ళు రాస్తాయి కైతలని-
భాష విశద పరచలేని వెతలని.
కడలికోసం వెదకకు-
కొలువైయ్యింది నా కనుగవల్లో.
నొప్పి గుండెకు, ఏడ్పు కళ్ళకు-
వీపున గొడితే పళ్ళూడినట్టు.
మెలి'కల దారి బ్రతుకు-
ఏ మలుపులో గెలుపుందో.
జీవితం ఒక్షణమే-
నేస్తమా గ్రహించు., అది ఈ క్షణమే.
తాతకు దగ్గుల తలపు-
ఉద్యమ లొసుగులు ఉగ్గుపాలవిద్య.
కన్నతల్లి వేదన-
కనిపించని భాషలో.
కన్నీటి ఆక్రందన-
కదనకుతూహల రాగంలో.
కన్నీళ్లు బాధకే ఇంకనీకు-
ఆనంద భాష్పాలకూ అవసరమౌతాయేమో.
ఓర్పు గెలుపు సయామీలు-
ఒకటి లేక మరొకటి మనజాలక.
గెలుపోటములు సరేc-
జీవితమొక పందెం,పాల్గొనడమే ఆనందం.
ఎటుపోయి ఎటో "మీటూ"-
మగరాయుళ్ళకూ పంచుతోంది చోటు.
జోక్యం తోబాటు లౌక్యమూ-
వింత భారతంలో చింతలకు తావీయక.
విచారమేదో ముందుండాలిగా-
ప్రచారంకై పాట్లు..తిట్లు.. అగచాట్లు.
కొంచపు బుద్ధి కంచెల్లోనూ-
లంచాలుమేస్ 'థూ', 'అవినీతే' ప్రపంచంగా.
ఆటోగ్రాఫ్ ఆనాటి ముచ్చట-
సెల్ఫీ సెలబ్రిటీతో ఐతే పండగేనట.



-గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి-74, జవహర్‌నగర్,
హైదరాబాద్-500 020.



# "మహా సాహసి మన సర్దార్"

బలం, ధైర్యం, సాహసాలను ఆయుధంగా చేసుకుని అన్యాయమూ, పక్షపాతమూ నిండిన ప్రపంచాన్నెదుర్కొనేందుకు తనకు తానే తయారు చేసుకోవడం ప్రారంభించాడు. అతి చిన్న వయసు నుంచే అలవరచుకోసాగాడు. నిర్భీతి, సక్రమైన ప్రవర్తన, ధృఢత్వం, తాను సరియైనదని, నమ్మిన దాని కోసం ఖచ్చితంగా నిలబడడం వాటిని ప్రదర్శించడం మరింత పెంచుకోవడం చేయసాగాడు. అందరిచే గుర్తింపబడ్డాడు.


వల్లభ్ భాయిపటేల్ 1875 అక్టోబర్ 31వ తేదీన గుజరాత్‌లోని కైరా జిల్లాలో కరంసాద్ అనే గ్రామంలో పటేల్ జవేరి భాయ్, లాడ్ దంపతులకు నాలుగవ సంతానంగా జన్మించాడు. 1897లో మెట్రిక్యులేషన్ ప్యాసై 1910 సంవత్సరంలో ఇంగ్లాండ్ వెళ్ళి మిడిల్ టెంపుల్ అనే చోట లా చదివాడు. ప్రధమ శ్రేణిలో ప్యాసయ్యాడు. తన కలని నిజం చేసుకున్నాడు. 1913 సంవత్సరంలో ఇంగ్లాండ్ నుంచి భారతదేశానికి తిరిగి వచ్చి అహ్మదాబాద్‌లో లాయర్ వృత్తిని ప్రారంభించి శరవేగంతో విజయపరంపరలు సాధించాడు. గొప్ప క్రిమినల్ లాయర్‌గా పేరు గడించాడు.

1917 సంవత్సరంలో ఒక రోజు స్నేహితులతో కలిసి పేకాడుతున్న సమయంలో గాంధీజీ అక్కడకు వచ్చి జాతీయ పాఠశాలను నెలకొల్పేందుకు సహకరించాలని కోరారు. గాంధీజీ వైపు పటేల్ కన్నెత్తైనా చూడలేదు. అదే ఏడాది గాంధీజి అధ్యక్షత వహించిన గుజరాత్ కాంగ్రెస్ సభకు పటేల్ కార్యదర్శిత్వం వహించాల్సి వచ్చింది. 1918 సంవత్సరంలో కైరా జిల్లాలో కరువు కారణంగా పన్ను మినహాయింపు ఇవ్వాలని రైతులు చేసిన విజ్ఞప్తిని, బ్రిటీష్ ప్రభుత్వం పట్టించుకోలేదు. కైరా సత్యాగ్రహాన్ని పటేల్ విజయవంతంగా పూర్తి చేయగా, తనకు సరియైన అనుచరుడు, కార్యదీక్షాపరుడు లభించాడని గాంధీజీ ప్రశంసించాడు.

ఆ తర్వాత అహ్మదాబాద్ మున్సిపల్ ఛైర్మన్‌గా, 1928 సంవత్సరంలో బార్ధోలీ సత్యాగ్రహ సారధిగా 1931 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, 1942 సంవత్సరంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పటేల్ చురుకైన పాత్రను నిర్వహించాడు. దేశ విభజన సమయంలో, భారత రాజ్యాంగ నిర్మాణంలో, సంస్థానాల విలీనంలో పటేల్ నాయకత్వ పటిమ ఉపయోగపడింది. మహాత్ముని ప్రభావంతో పటేల్ జీవితం దేశానికి అంకితమైంది. సర్దార్ పేరుతో ప్రస్తుతించబడింది.


స్వాతంత్ర్యానంతరం, నవ భారత ఐక్యత, సమగ్ర జాతి నిర్మాతగా, ఉక్కు మనిషిగా, జాతీయ అగ్రశ్రేణి నేతగా ఆరాధ్యనీయుడైనారు. సర్వసత్తాక ప్రతిపత్తి గల దేశంగా భారత్ అవతరించడానికి ఎంతో కృషి చేశారు. " మహా సాహసి మన సర్దార్ " ఉక్కు మనిషిగా దేశ ప్రజలు కీర్తించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 1950 డిశంబర్ 15న తన 75వ ఏట మరణించారు. భారతదేశం సమర్థవంతుడైన, జాతి నిర్మాణ ఐక్యసారధి, త్యాగశీలి అయిన దేశభక్తాగ్రణ్యున్ని కోల్పోయింది. మరణించిన నాలుగు శతాబ్దాల అనంతరం 1991లో భారత ప్రభుత్వం "భారత రత్న" బిరుదునిచ్చి గౌరవించింది.

ఉన్నత వ్యక్తిత్వానికి సరితూగేంత ఎత్తయిన విగ్రహాన్ని, భారత ప్రభుత్వం నిర్మించి, భారతావని కృతజ్ఞతాంజలి ఘటించి దేశ ప్రజలకు అంకితం చేసింది. జాతి నిర్మాతగా, సుస్థిర భారతావని ఆవిష్కర్తగా పటేల్ చిరకాల చరిత్రలో నిలిచిపోతారు.



-తాడినాడ భాస్కరరావు
9441831544

### నేటి కవిత




నవ్వడం ఒక భోగం... నవ్వించడం ఒక యోగం... నవ్వలేకపోవడం రోగం...అంటారు.
నవ్వు నాలుగు విధాల చేటు అన్నది పాత నానుడి.
నవ్వు నాలుగు విధాల మేలు అన్నది కొత్త నానుడి.
మనసారా నవ్వుకోవడం వల్ల రోగాలు దరి చేరవు, అంతేకాకుండా హాస్యం మనసును తేలిక పరుస్తుంది. హాస్యం ఓదార్పునిస్తుంది, ఉత్సాహాన్నిస్తుంది, శక్తినిస్తుంది, ప్రేరణనిస్తుంది. అలాంటి హాస్యరసంతో కూడిన కవితలను ఇరు తెలుగు రాష్ట్రాల కవుల నుండి ఆహ్వానిస్తుంది.

భవాని ప్రచురణలు

**హాస్య కవితలకు ఆహ్వానము**

- కవిత 24 పంక్తులు మించకుండా ఉండాలి. 24 పంక్తులు మించిన కవితలు పరిశీలించబడవు.
- కవిత్వాంశంగా ఏదైనా తీసుకోవచ్చు. కానీ హాస్యాన్ని పండించే విధంగా ఉండాలి.
- వివాదాస్పదం కానటువంటి కవితలను పంపించాలి. ఎవరిని నొప్పించని విధంగా కవితలుండాలి.
- కవితతో పాటు ఇది నా స్వంత కవిత అని, దేనికి అనువాదం కాని, అనుసరణ కాని కాదని, ప్రత్యేకంగా ఈ సంకలనం కోసం రాయబడిందని, సంకలనం వచ్చునంతవరకు ఏ మాధ్యమంలో పెట్టనని, ఏ పత్రికలకు, ప్రసార మాధ్యమాలకు పంపనని రాతపూర్వకంగా మీ సంతకంతో పాటు రాసి, దాని ఫోటో కాపీ కవితతో పాటు పంపించాలి.
- కవితలను పంపడానికి ఎలాంటి రుసుము లేదు.
- ఎంపిక చేయబడిన కవితలు మాత్రమే సంకలనంలోకి తీసుకోబడతాయి. ఇట్టి విషయంలో వాదోపవాదాలకు ఎలాంటి తావు లేదని గమనించగలరు.
- కవితలను నవంబర్ 15 వరకు 9014559059 వాట్సప్ నెంబరుకు సెల్‌లో టైప్ చేసి పంపాలి. రాత ప్రతులు, ఫోటో కాపీలు ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబడవు.
- నవంబర్ 25న ఎంపికయిన కవుల కవితల లిస్ట్ ప్రకటించబడుతుంది.
- ఎంపిక కాబడిన కవితలను పుస్తకరూపంలోకి తీసుకురాబడుతుంది. ప్రముఖులచే ఆ పుస్తక ఆవిష్కరణ ఉంటుంది. కవులకు ఆహ్వానం ఉంటుంది.
- వసతి సౌకర్యాలు ఎవరికి వారే చూసుకోవాలి.
- కవితల ఎంపిక, పుస్తక ప్రచురణ మరియు ఆవిష్కరణ తేదీలు తదితర అంశాలకు సంబంధించిన పూర్తి హక్కులు సంపాదకులకే చెందుతాయి.
- సందేహాలున్నచో 90145 59059 నెంబరులో సంప్రదించగలరు.

ఎ. గజేందర్‌రెడ్డి
సెల్: 9848894086

డా॥ వైరాగ్యం ప్రభాకర్
సెల్: 9014559059

